మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 89 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad






## జీవన్‌రెడ్డికి కాంగ్రెస్ అధినాయకత్వం

# బుజ్జగింపు

ఫోన్ చేసి మాట్లాడిన పార్టీ జనరల్ సెక్రటరీ కెసి వేణుగోపాల్

మంత్రి పదవి ఇస్తామని ఆఫర్ ఇచ్చినట్లుగా ప్రచారం

జీవన్ ఇంటికి వెళ్లి చర్చించిన భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు

రాజీనామా అంశాన్ని ఉపసంహరించుకున్న జీవన్‌రెడ్డి

హైదరాబాద్,జూన్25 (ప్రజా మంటలు): కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తన రాజీనామాపై వెనక్కి తగ్గినట్లు సమాచారం. జీవన్ రెడ్డితో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మంత్రి శ్రీధర్ బాబు జీవన్‌రెడ్డి నివాసంలో ఏకాంత చర్చలు జరిపారు. సీఎం హైదరాబాద్‌కు వచ్చి మాట్లాడిన తర్వాత మీరు ఏం నిర్ణయం తీసుకున్నా అది మీ ఇష్టం. అప్పటి దాకా మా మాట వినాలని శ్రీధర్ బాబు, భట్టి కోరారు. అనంతరం పార్టీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్‌తో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మిగతా 2లో..



## ఢిల్లీలో బిజీగా సిఎం రేంవత్ షెడ్యూల్

### నీట్ అవకతవకలపై సిట్టింగ్ జడ్జి విచారణకు డిమాండ్

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): ఢిల్లీ పర్యటనలో ఉన్న సిఎం రేవంత్ కాంగ్రెస్ పెద్దలతో పాటు, కేంద్ర మంత్రులను కలుస్తున్నారు. వివిధ సమస్యలను ప్రస్తావిస్తూ వాటి కోసం మంత్రులను మిగతా 2లో..



## విద్యుత్ కొనుగోళ్లపై మరింత సమాచారం ఇవ్వండి

### కెసిఆర్‌కు మరో లేఖ రాసిన నరసింహారెడ్డి కమిషన్

హైదరాబాద్,జూన్25 (ప్రజా మంటలు): విద్యుత్ కొనుగోళ్లపై విచారణ చేస్తున్న జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు మరో లేఖ రాసింది. విద్యుత్ కొనుగోళ్ల అంశంపై మరింత సమాచారం ఇవ్వాలని ఈ నెల 19న లేఖ పంపించింది. యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ ప్లాంట్ల నిర్మాణంపై మరిన్ని వివరాలు తెలియజేయాలని అందులో పేర్కొంది. ఛత్తీస్‌గఢ్ నుంచి కొన్న విద్యుత్ గురించి మరింత సమాచారం కోరింది. ఇటీవల కమిషన్ ఎదుట పలువురు లేవనెత్తిన సందేహాలను లేఖలో ప్రస్తావించింది. వాటిపై ఈ నెల 27 లోపు సమాధానమివ్వాలని కమిషన్ సూచించింది. అయితే మరోవైపు కమిషన్‌నే రద్దు చేయాలని కెసిఆర్ హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

## కాంగ్రెస్ గూటికి గూడెం మహిపాల్ రెడ్డి

### సిఎం రేవంత్ వెంట ఢిల్లీకి చేరుకున్న ఎమ్మెల్యే

హైదరాబాద్,జూన్25 (ప్రజా మంటలు): బీఆర్ఎస్ కు వరుసగా షాకులమీద షాకులు తగులుతున్నాయి. ఇటీవలే బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాంగ్రెస్ లో చేరగా.. లేటెస్ట్ గా పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ చేరేందుకు సిద్ధమయ్యారు. సీఎం రేవంత్ వెంట ఢిల్లీ వెళ్లిన మహిపాల్ రెడ్డి ఏఐసీసీ పెద్దల సమక్షంలో కాంగ్రెస్ లో చేరనున్నారు. ఎన్నికల ముందు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, స్టేషన్ ఘన్ పూర్



ఎమ్మెల్యే కడియం శ్రీహరి, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్ రావు కాంగ్రెస్ మిగతా 2లో..



## ఎన్‌హెచ్‌ఎం బకాయిలు రూ.693.13 కోట్లు విడుదల చేయండి

### కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి.నడ్డాకు సిఎం రేవంత్ రెడ్డి వినతి

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద తెలంగాణకు రావల్సిన బకాయిలు రూ.693.13 కోట్లు వెంటనే విడుదల మిగతా 2లో..

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

### మూడు బాక్సుల్లో ఆధారాలు కోర్టుకు సమర్పణ



హైదరాబాద్,జూన్25 (ప్రజా మంటలు): తెలుగు రాష్ట్రాల్లో పెనుసంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు తుది దశకు చేరుకుంది. ఇప్పటికే పలు సంచలన మిగతా 2లో..

## డికె శికుమార్‌తో జగన్ భేటీ

### పార్టీని కాంగ్రెస్‌లో విలీనం కోసం చర్చలు

### బెంగులూరులో మకాం వేసిందే అందుకోసం

### బిజెపి ఎమ్మెల్యే నల్లమిల్లి సంచలన వ్యాఖ్యలు



విజయవాడ,జూన్25 (ప్రజా మంటలు): వైసిపిని జగన్ కాంగ్రెస్‌లో విలీనం చేయడం ఖాయమని బిజెపి ఎమ్మెల్యే నల్లమిల్లి సంచలన వ్యాఖ్యలు చేశారు. వైఎస్ఆర్‌సీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి బెంగళూరు వెళ్లింది ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తో చర్చలకు అని బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆనపర్తిలో మీడియాతో మాట్లాడిన మిగతా 2లో..

## డ్రగ్స్ విషప్రయోగంతో సమానం

- డ్రగ్స్ నిర్మూలకు ప్రభుత్వం కఠిన చర్యలు
- జలవిహార్ వద్ద ర్యాలీని ప్రారంభించిన భట్టి



హైదరాబాద్,జూన్25 (ప్రజా మంటలు): రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనకు తమ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఈ విషయంపై ఏ స్థాయిలో అయినా నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డులో జలవిహార్ వద్ద డ్రగ్స్ నిర్మూలన ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. డ్రగ్స్ వినియోగం విషప్రయోగం లాంటిది.. ఇది అత్యంత ప్రమాదకరం. కుటుంబ వ్యవస్థలను విచ్ఛిన్నం చేస్తుందని అన్నారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న సంఘ విద్రోహశక్తుల చేతిలో యువత జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయి. తెలిసీ తెలియని వయసులో వాటి బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. కొందరు కావాలనే తమ అక్రమ సంపాదన కోసం యువతకు డ్రగ్స్ అంటగడుతున్నారు. దేశాన్ని బలహీనపరిచేందుకు దేశద్రోహులు చేస్తున్న ప్రయత్నంగానూ దీన్ని చూడొచ్చని అన్నారు. రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యత మనపైనే ఉంది. డ్రగ్స్ నిర్మూలనకు నార్కోటిక్ బ్యూరోకు ఎంత బడ్జెట్ అయినా కేటాయిస్తాం. వాటి వినియోగం, రవాణా లేకుండా చేయాల్సిన బాధ్యత ఆ అధికారులదే. పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగమే కాకుండా ప్రజల నుంచి కూడా సహకారం అందాలి. డ్రగ్స్ సరఫరా చేసేవారు ఎక్కడున్నా అరెస్ట్ చేసే శక్తి సామర్థ్యాలు పోలీసు వ్యవస్థకు ఉన్నాయి. పోలీసులకు సమాచారం ఇచ్చే వ్యవస్థను బలోపేతం చేసుకోవాలని సూచించారు. అన్ని గ్రామాల్లో డ్రగ్స్ నిర్మూలన మిగతా 2లో..


## రాజ్యాంగ ప్రతులతో విపక్ష ఎంపిల ప్రమాణం

### దానినే పాటించిన రాహుల్, అఖిలేశ్ యాదవ్



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): 18వ లోక్‌సభ తొలి సమావేశాలు కొత్త పార్లమెంట్ భవనంలో విపక్షాల ఆందోళనల నడుమ కొనసాగుతున్నాయి. ఈ సమావేశాలు సోమవారం ఉదయం ప్రారంభమైన విషయం తెలిసిందే. తొలిరోజు 280 మంది ఎంపీలు లోక్‌సభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఎంపీలతో ప్రొటెం స్పీకర్ బర్తృహరి మహతాబ్ ప్రమాణం చేయించారు. రెండోరోజైన మంగళవారం కూడా మిగిలిన మిగతా 2లో..


## ప్రజా నాడి




## నీట్‌అక్రమాలపై సిబిఐ దూకుడు

### పలువురిపై కేసులు నమోదు - అక్రమాలను ఆరా తీస్తున్న అధికారులు

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): నీట్ అక్రమాలపై దర్యాప్తు బాధ్యతలను స్వీకరించిన సీబీఐ జోరు పెంచింది. బిహార్, గుజరాత్ రాష్ట్రాల్లో నీట్ అవకతవకలకు సంబంధించి నమోదైన ఒక్కో కేసును రీ రిజిస్టర్ చేసింది. రాజస్థాన్‌లో మూడు కేసుల దర్యాప్తును స్వీకరించింది. మహారాష్ట్రలోని లాతూరులో యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) నమోదు చేసిన మరో కేసును కూడా సీబీఐ స్వాధీనం చేసుకునే అవకాశం ఉంది. కాగా.. నీట్ అక్రమాలపై బిహార్, గుజరాత్‌లో నమోదైన కేసుల దర్యాప్తునకు ఆదివారానికే పట్నా, గోధ్రాకు చేరుకున్న సీబీఐ ప్రత్యేక బృందాలు దర్యాప్తును ముమ్మరం చేశాయి. పట్నాకు చేరుకున్న సీబీఐ బృందం.. కొద్దిరోజులుగా అక్కడ పేపర్ లీక్ కేసును మిగతా 2లో..




## నీట్ పరీక్షను పూర్తిగా రద్దుచేయాల్సిందే

### మెడికల్ సీట్ల ఎంపిక స్వేచ్ఛ రాష్ట్రాలకే ఉండాలి

### ప్రధాని మోదీకి సీఎం మమతా బెనర్జీ లేఖ

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): నీట్ పరీక్షను పూర్తిగా రద్దుచేయాలని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కోరారు. ప్రశ్నపత్రం లీకేజీపై మిగతా 2లో..



## మళ్లీ జన్మంటూ ఉంటే కుప్పంలోనే పుడతా

### ఐదేళ్లలో కుప్పంను తీర్చిదిద్దుతా

### అభివృద్ధికి నమూనాగా మార్చేస్తా

### విమానాశ్రయం కూడా ఏర్పాటు చేస్తా

### కుప్పంలో రౌడీయిజం చేస్తే..అదే చివరి రోజు

### కుప్పం పర్యటనలో సిఎం చంద్రబాబు

చిత్తూరు,జూన్25 (ప్రజా మంటలు): కుప్పం ప్రజలు ఎప్పుడూ తనపై నమ్మకం ఉంచారని, మరో జన్మంటూ ఉంటే కుప్పంలోనే జన్మిస్తానని సీఎం చంద్రబాబు అన్నారు. ఎవరైనా కుప్పంలో రౌడీయిజం చేస్తే.. అదే వారికి చివరిరోజు అవుతుందని హెచ్చరించారు. కేబినెట్లో 8మందికి కొత్తవారికి అవకాశం కల్పించామని కుప్పం నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన సభలో చెప్పారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తన సొంత నియోజకవర్గం కప్పంలో ఇది తొలిపర్యటన. ఈ పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను శ్రీకారం చుట్టారు. గాలేరు నగరి, హంద్రీనీవా ప్రాజెక్టులను పరిశీలించారు. అనంతరం కుప్పం బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన బహిరంగసభలో ప్రసంగించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. కుప్పంను అభివృద్ధికి నమూనాగా తయారు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ నియోజకవర్గానికి ఔటర్ రింగ్ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తామన్నారు. అంతేకాకుండా ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అందులో భాగంగా ఒక్కో గ్రామానికి రూ. 10కోట్లు అభివృద్ధి నిధి ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఇటీవల జరిగిన ఎన్నికలు ఎంతో చారిత్రాత్మకం అని వివరించారు. రాబోయే ఐదేళ్లలో కుప్పం ప్రజల రుణం తీర్చుకుంటానని మిగతా 2లో..

## డ్రగ్స్ విషప్రయోగంతో సమానం

కమిటీలు వేయాలి. కొత్త వ్యక్తులపై ఎల్లప్పుడూ నిఘా ఉంచాలి. తాత్కాలిక సంతోషాలకు విద్యార్థులు బలి కావొద్దు. వారు అడ్డదారులు తొక్కితే కుటుంబంతో పాటు సమాజం మొత్తం బాధపడాల్సి ఉంటుందని భట్టి విక్రమార్క అన్నారు. కార్యక్రమంలో సిఎస్ శాంతికుమారి, పలువురు పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## జీవన్‌రెడ్డికి కాంగ్రెస్ అధినాయకత్వం బుజ్జగింపు

ఫోన్‌లో మాట్లాడించారు. కేసీతో ఫోన్లో మాట్లాడిన తర్వాత జీవన్ రెడ్డి తన రాజీనామా విషయంలో వెనక్కి తగ్గారు. అయితే జీవన్ రెడ్డికి కేసీ వేణుగోపాల్ మంత్రి పదవి ఆఫర్ చేసిట్లు తెలిసింది. అందుకే ఆయన రాజీనామా విషయంలో వెనక్కి తగ్గారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కాగా, జగిత్యాల బిఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడంపై జీవన్ రెడ్డి ఆగ్రహంగా ఉన్నారు. ఆయన చేరికపై పార్టీ అధిష్ఠానం కనీసం తనకు సమాచారం ఇవ్వకపోవడంతో అసనం వ్యక్తంచేశబూరు. ఈ నేపథ్యంలో తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. 2014లో జీవన్‌రెడ్డి చేతిలో ఓడిపోయిన సంజయ్.. ఆ తర్వాత జరిగిన 2018, 2023 ఎన్నికల్లో ఆయనపై విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడంపై అలకబూని.. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానంటూ ప్రకటన చేసిన ఎమ్మెల్సీ టీ.జీవన్‌రెడ్డిని బుజ్జగించేందుకు ఏఐసీసీ ఏకంగా మంత్రి పదవి ఇస్తామంటూ ఆఫర్ ఇచ్చింది. ఈ మేరకు కాంగ్రెస్ హైకమాండ్ నుంచి జీవన్ రెడ్డికి ఆఫర్ వచ్చినట్టు తెలుస్తోంది. ఈ విషయంపై స్వయంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు ఇద్దరూ జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లి చర్చలు జరిపారని సమాచారం. మ్మెల్సీ పదవికి జీవన్ రెడ్డి రాజీనామా చేయకుండా ఇరువురు నేతలు మంతనాలు కొనసాగించారు. ఇందులో భాగంగానే పార్టీ మంత్రి పదవిని ఆఫర్ చేస్తోంది. ఈ మేరకు ఏఐసీసీ కూడా సుముఖంగా ఉంది. కాగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి దీపాదాస్ మున్షీ కూడా రంగంలోకి దిగారు. ఫోన్ చేసి మాట్లాడారు. రాజీనామా నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ వచ్చాక అన్ని విషయాలు మాట్లాడుతామని మున్షీ హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది. మరోవైపు అందుబాటులో ఉన్న పార్టీ సీనియర్లు రాజీనామా ఆలోచనను విరమించుకోవాలని జీవన్ రెడ్డిని కోరుతున్నారు. కాగా బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ సంజయ్‌కుమార్‌ను కాంగ్రెస్‌లో చేర్చు కోవడంపై జీవన్‌రెడ్డి కినుక వహించిన విషయం తెలిసిందే. తీవ్ర అసంతృప్తికి గురైన ఆయన రాజీనామాకు సిద్ధమయ్యారు. నాలుగు దశాబ్దాలుగా క్రియాశీల రాజకీయాల్లో ఉన్న తనను మాటమాత్రంగానైనా సంప్రదించకుండా తన సొంత నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేను పార్టీలో చేర్చుకోవడాన్ని ఆయన ఆక్షేపించారు. ఇది తనను అగౌరవపరిచినట్లేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. జగిత్యాల కాంగ్రెస్ నాయకులే కాకుండా ఇతర జిల్లాలకు చెందిన వందలాది కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధులు సైతం సోమవారం ఉదయమే జీవన్‌రెడ్డి నివాసానికి చేరుకున్నారు. రాత్రి వరకూ అక్కడే ఉండి జీవన్‌రెడ్డి ఆవేదనలో పాలుపంచుకున్నారు.

## నీట్‌అక్రమాలపై సిబిఐ దూకుడు

అత్యంత సమర్థంగా దర్యాప్తు చేస్తున్న ఆర్థిక నేరాల విభాగం కార్యాలయానికి సోమవారం ఉదయం వెళ్లి కీలక వివరాలు సేకరించింది. ముమ్మర దర్యాప్తు చేసి ఇప్పటికే 18 మందిని అరెస్టు చేసిన ఈవోయు.. వారి మొబైల్ ఫోన్లను, సిమ్‌కార్డులను, ల్యాప్‌టాప్‌లను, పోస్ట్‌డేటెడ్ చెక్కులను, కాల్చేసిన నీట్ ప్రశ్నపత్రం అవశేషాలను స్వాధీనం చేసుకుంది. నీట్ అక్రమాలపై దర్యాప్తు బాధ్యతను సీబీఐకి బదిలీ చేస్తూ బిహార్ సర్కారు ఆదివారం సాయంత్రం నోటిఫికేషన్ జారీ చేసిన నేపథ్యంలో.. ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న నిందితులందరినీ విచారణ నిమిత్తం సీబీఐ బృందం ట్రాన్సిట్ రిమాండ్‌పై ఢిల్లీకి తీసుకెళ్లే అవకాశం ఉందని ఈవోయు అధికారి ఒకరు తెలిపారు. ఈ కేసులో కీలక నిందితుడైన దానాపూర్ మునిసిపల్ కార్పొరేషన్ జూనియర్ ఇంజనీర్ సికందర్ ప్రసాద్ యాదవేందుపై ఆదాయానికి మించి ఆస్తుల కేసు కూడా సీబీఐ నమోదు చేసే అవకాశం ఉందని వెల్లడించారు. యాదవేందును ఈ కేసులో ప్రధాన నిందితుడిగా గుర్తించినట్టు ఆ అధికారి వెల్లడించారు. అతడికి క్రిమినల్ కార్యకలాపాల్లో పాల్గొన్న చరిత్ర ఉంది. 2012లో జూనియర్ ఇంజనీర్ కాక ముందు అతడు రాంచీలో కాంట్రాక్టర్‌గా పనిచేసేవాడు. గతంలో జరిగిన రూ.3 కోట్ల విలువైన ఎల్‌ఈడీ స్కామ్‌లో అతడికి జైలు శిక్ష పడింది‘ అని ఆ అధికారి వివరించారు. మరోవైపు.. గోధ్రాకు చేరుకున్న సీబీఐ బృందం స్థానిక పోలీసు అధికారులను కలిసి, నీట్ పేపర్ లీక్‌కు సంబంధించి వివరాలు సేకరించినట్టు పంచమహల్ జిల్లా ఎస్పీ హిమాన్షు సోలంకి తెలిపారు. సీబీఐ దర్యాప్తునకు తాము అన్ని విధాలుగా సహకరిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కేసులో గుజరాత్ పోలీసులు ఇప్పటిదాకా ఐదుగురిని అరెస్ట్ చేశారు. అక్కడి ఒక కేంద్రంలో పరీక్ష రాసే 27 మంది అభ్యర్థులతో వారు ఒప్పందం చేసుకున్నారు. దాని ప్రకారం.. వారు ప్రశ్నపత్రంలో తమకు తెలిసిన సమాధానాలు రాసి మిగతావాటిని వదిలిపెడితే, వాటికి వీరు సమాధానాలు రాస్తారు. ఇందుకోసం ఒక్కొక్క అభ్యర్థి నుంచి రూ.10 లక్షలు తీసుకున్నారు. ఈ మేరకు వారిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. వారు సహకరించినప్పటికీ.. ఆ 27 మందిలో ముగ్గురు మాత్రమే నీట్‌ను క్లియర్ చేసినట్టు సమాచారం. ఇక.. మహారాష్ట్రలోనూ నీట్ అక్రమాలకు పాల్పడ్డ ఆరోపణలపై నాందేడ్ యాంటీ టెర్రరిజమ్ స్క్వాడ్ (ఏటీఎస్) అధికారులు లాతూర్‌కు చెందిన జలీల్ ఖాన్ ఉమర్ ఖాన్ పఠాన్ అనే జిల్లా పరిషత్ స్కూల్ టీచర్‌ను అరెస్ట్ చేశారు. అతడితో పాటు లాతూరుకే చెందిన సంజయ్ తుకారామ్ జాధవ్ అనే టీచర్‌పైన, నాందేడ్‌కు చెందిన ఇరాన్నా మషన్జీ కొంగల్వావ్, ఢిల్లీకి చెందిన గంగాధర్ అనే ఇద్దరు వ్యక్తులపైన కేసు నమోదు చేశారు. జలీల్‌ఖాన్‌ను అరెస్ట్ చేసిన ఏటీఎస్ అధికారులు.. పరారీలో ఉన్న మిగతా ముగ్గురి కోసం గాలిస్తున్నారు. కాగా.. నీట్ పరీక్షను రద్దు చేసి, మళ్లీ పరీక్ష నిర్వహించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను విచారించిన రాజస్థాన్ హైకోర్టు.. ఆ పిటిషన్లపై స్పందన తెలపాలంటూ జాతీయ టెస్టింగ్ ఏజెన్సీకి, కేంద్రానికి నోటీసులు జారీ చేసింది.నియమించేందుకు ఇంటర్వ్యూలు చేస్తున్నారని కాంగ్రెస్ నేత పవన్ ఖేడా ఆరోపించారు.

## నీట్ పరీక్షను పూర్తిగా రద్దుచేయాల్సిందే



సమగ్ర నిష్పాక్షిక దర్యాప్తు జరిపించాలని ప్రధాని మోదీకి లేఖ రాశారు. నీట్‌ను తొలగించి, ఉమ్మడి ప్రవేశ పరీక్ష ద్వారా మెడికల్ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులను ఎంపిక చేసే స్వేచ్ఛను రాష్ట్రాలను అప్పగించే అంశాన్ని పరిశీలించాలని ప్రధానిని కోరారు. తక్షణమే పాత పద్ధతిని పునరుద్ధరించాలని ప్రధానమంత్రిని కోరారు. భారత్, బంగ్లాదేశ్ మధ్య నీటి పంపకాలకు సంబంధించి ఇరు దేశాల ప్రధానులు నరేంద్ర మోదీ, షేక్ హసీనా మధ్య జరిగిన చర్చలకు కేంద్రం తనను ఆహ్వానించక పోవడంపై పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ మండిపడ్డారు. పశ్చిమబెంగాల్ ప్రమేయం లేకుండా ఇరు దేశాలు నీటి పంపకాలపై చర్చలు జరపడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేస్తూ మోదీకి లేఖ రాశారు. పశ్చిమబెంగాల్ రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదించకుండా, అభిప్రాయం తీసుకోకుండా ఏకపక్షంగా చర్చలు, సంప్రదింపులు జరపడం ఆమోదయోగ్యం కాదు' అని మమత పేర్కొన్నారు. తీస్తా నదీ జలాల పరిరక్షణ-నిర్వహణ, 1996 నాటి గంగా జలాల ఒప్పందం పునరుద్ధణ అంశాలపై ఇటీవల మోదీ, హసీనా చర్చలు జరిపారు. అనంతరం మోదీ మీడియాతో మాట్లాడుతూ.. త్వరలో సాంకేతిక బృందాన్ని బంగ్లాదేశ్కు పంపనున్నట్టు తెలిపారు. ఒప్పందం ప్రకారం తీస్తా జలాల పరిరక్షణ, నిర్వహణకు తగిన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పెద్ద రిజర్వాయర్లు నిర్మించడానికి భారత్ సిద్ధంగా ఉంది. అయితే భారత్, బంగ్లాదేశ్ మధ్య నీటి పంపకాల ఒప్పందాన్ని చాలాకాలంగా మమత వ్యతిరేకిస్తున్నారు.

## ఢిల్లీలో బిజీగా సిఎం రేంవత్ షెడ్యూల్

అర్థిస్తున్నారు. ఈ క్రమంలో నీట్ అవకతవకలపై సిట్టింగ్ జడ్జ్‌తో విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పరీక్ష నిర్వహణలో కేంద్రం విఫలం అయిందని మండిపడ్డారు. సీబీఐ విచారణ సరిపోదని చెప్పారు. కోట్లాదిమంది విద్యార్థుల భవితవ్యానికి సంబంధించిన అంశం, కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రధాని మోదీ మౌనం వహించడం సరికాదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మరోవైపు ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అధికారికంగా కాంగ్రెస్‌లో చేరారు. ఏఐసీసీ కేంద్ర కార్యాలయంలో పోచారం శ్రీనివాస్ రెడ్డికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ఆహ్వానించారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని పార్టీ కార్యాలయానికి సీఎం రేవంత్ రెడ్డి తీసుకొచ్చారు. ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌కు పోచారం శ్రీనివాస్ రెడ్డిని రేవంత్ రెడ్డి పరిచయం చేశారు. అలాగే ఏఐసీసీ అగ్రనేతలతో రేవంత్ సమావేశం కానున్నారు. మంత్రివర్గ విస్తరణ, టీపీసీసీ అధ్యక్ష ఎంపిక, తదితర కీలక అంశాలపై చర్చించే అవకాశాలు ఉన్నాయి. సాయంత్రం హైదరాబాద్ తిరిగి రానున్నారని సమాచారం. తన రాజకీయ జన్మ మొదలైంది కాంగ్రెస్‌తోనే, చివరకు ముగిసేది కాంగ్రెస్‌లోనే అని ఎమ్మెల్యే పోచారం ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్‌లో తిరిగి చేరడం సంతోషంగా ఉందని చెప్పారు. ఆరునెలలుగా పరిపాలనను గమనిస్తున్నా, అంకితభావంతో రేవంత్ నడుపుతున్నారని వివరించారు. రేవంత్ రెడ్డి సమర్థవంతంగా పాలన అందిస్తున్నారని కొనియాడారు. రైతులకు మంచి జరగాలనే రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ తాను, తన అనుచరులు మొత్తం కాంగ్రెస్‌లో చేరారు అని పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఇకపోతే మంత్రివర్గ విస్తరణలో పోచారంకు స్థానం ఉందంటూ ప్రచారం సాగుతోంది.

## రాజ్యాంగ ప్రతులతో విపక్ష ఎంపిల ప్రమాణం

ఎంపీలు ప్రమాణం చేసారు. అయితే, ఈ సమావేశాల్లో విపక్ష ఇండియా కూటమి ఎంపీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రొటెం స్పీకర్ నియమించిన తీరుకు వ్యతిరేకంగా సమావేశాలు ప్రారంభం నుంచి విపక్ష కూటమి పార్టీల ఎంపీలంతా రాజ్యాంగ ప్రతులతో సభలో నిరసన తెలుపుతున్నారు. అదేవిధంగా రాజ్యాంగ ప్రతులతోనే ప్రమాణ స్వీకారం కూడా చేస్తున్నారు. పోడియం వద్దకు వెళ్లి ముందుగా తమ చేతిలో ఉన్న రాజ్యాంగ ప్రతిని చూపించిన తర్వాతే ప్రమాణ స్వీకారం చేస్తున్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా కూటమి పార్టీల ఎంపీలంతా ఇదే విధానాన్ని ఫాలో అవుతున్నారు. అఖిలేశ్ యాదవ్ కూడా రాజ్యాంగ ప్రతిని పట్టుకుని ప్రమాణం చేశారు.

## డికె శికుమార్‌తో జగన్ భేటీ

ఆయన .. ప్రజలు ప్రతిపక్ష నేత హోదా కూడా ఇవ్వకుండా ఓడించడంతోదిక్కుతోచని స్థితిలో ఉన్న ఆయన తన పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు డీకే శివకుమార్ తో చర్చలు జరిపినట్లుగా సమచారం ఉందన్నారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి పులివెందుల వెళ్లారు. అక్కడ రెండు రోజులు ఉన్న తరవాత బెంగళూరు చేరుకున్నారు. ప్రస్తుతానికి ఆయన అక్కడే ఉంటారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. మళ్లీ అసెంబ్లీ సమావేశాలు ఉన్నప్పుడు ఏపీకి వచ్చే అవకాశం ఉంది. అయితే ఆయనకు ప్రతిపక్ష నేత హోదా ఇస్తేనే వస్తారని లేకపోతే రారని వైసీపీ వర్గాలు చెబుతున్నాయ. ఒక వేళ అసెంబ్లీకి రాకూడదని నిర్ణయం తీసుకుంటే ఆయన బెంగళూరులోనే ఉండిపోయే అవకాశం ఉంది. అయితే కాంగ్రెస్ తో విలీనానికి చర్చలు అన్నది మాత్రం రాజకీయవర్గాల్లో ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చిన సొంత పార్టీ పెట్టుకున్న తర్వాత ఆయన ఇప్పటి వరకూ కాంగ్రెస్ గురించి ఎప్పుడూ సానుకూలంగా మాట్లాడలేదు. పైగా రాహుల్ గాంధీపై పలుమార్లు విమర్శలు చేశారు కూడా. ఇటీవల కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి అంశాల వారీగా మద్దతు ఉంటుందని చెప్పారు. అంతే కానీ ఇండియా కూటమి వైపు వెళ్తున్నామన్న సంకేతాలు కూడా ఇవ్వలేదు. ఇటీవల ఈవీఎంలపై జగన్మోహన్ రెడ్డి అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బ్యాలెట్ తో ఎన్నికలు నిర్వహించాలంటున్నరు. ఇండియా కూటమి డిమాండ్ కూడా ఇదే . దాంతో మెల్లగా ఇండియా కూటమి దారిలోకి జగన్ వెళ్తున్నారన్న చర్చ జరిగింది. కానీ అలాంటిదేమీ లేదని.. తమ పార్టీ ఓటమిపై ఉన్న అనుమానాల్ని మాత్రం వ్యక్తం చేస్తున్నామని అంటున్నారు. వైఎస్ చనిపోయిన తర్వాత రాహుల్ ను ప్రధానిని చేయడమే తమ లక్ష్యమని జగన్ ప్రకటించారు. తర్వాత మనసు మార్చుకున్నారు. అయితే ఇప్పుడు సోదరి షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరి పీసీసీ చీఫ్ అయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకును వెనక్కి తెచ్చేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అదే జరిగితే వైసీపీ ఎక్కువ నష్టం జరుగుతుందన్న అంచనాలు ఉన్నాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ లో విలీనానికి వైసీపీ చర్చలేనే పుకార్లు రావడం ఆసక్తికరంగా మారింది.

## మళ్లీ జన్మంటూ ఉంటే కుప్పంలోనే పుడతా

అన్నారు. కేబినెట్లో కొత్తవారికి ఎక్కువగా అవకాశం ఇచ్చామన్నారు. అలాగే 8మంది బీసీలకు కేబినెట్లో చోటు కల్పించామని చెప్పారు. కుప్పంలో హంద్రీనీవా నీటితో చెరువులన్నీ నింపుతామన్నారు. వైసీపీకి కాంట్రాక్టర్లపై ఉన్న ప్రేమ రైతులపై లేదని విమర్శించారు. త్వరలోనే కుప్పంకు విమానాశ్రయం తీసుకువస్తామన్నారు. అంతకుముందు శాంతిపురం మండలం చిన్నారి దొడ్డి, జల్లిగాని పల్లి దగ్గర హంద్రీ నీవా కాలువ పనులు చంద్రబాబు పరిశీలించారు. హంద్రీ నీవా కాలువ స్థితిగతులపై ఇరిగేషన్ శాఖ అధికారులతో చర్చించారు. ఇంకా చేపట్టాల్సిన పనులు, పూర్తి కావాల్సిన పనుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. శాంతిపురం మండలం శివపురంలో తన సొంత ఇంటి నిర్మాణ పనులను పరిశీలించారు చంద్రబాబు. 2 ఏళ్ల క్రితం చంద్రబాబు ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. 2.1 ఎకరాల స్థలంలో ఈ ఇంటి నిర్మాణం కొనసాగుతోంది. నిర్మాణ పనులపై కాంట్రాక్టర్ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు ఏపీ సీఎం. ఎన్టీఆర్ సర్కిల్ దగ్గర ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించిననంతరం ఆర్ అండ్ బి అతిథి గృహంలో పార్టీ నేతలతో సమావేశం అవుతారు సీఎం చంద్రబాబు. అనంతరం ఉండవల్లిలోని తన నివాసానికి బయలుదేరి వెళనున్నారు.

## ఎన్‌హెచ్‌ఎం బకాయిలు రూ.693.13 కోట్లు విడుదల చేయండి

చేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి.నడ్డాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రిని మంగళవారం ఆయన కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైద్యారోగ్య రంగంపై తెలంగాణ ప్రభుత్వం పెడుతున్న ప్రత్యేక శ్రద్ధను కేంద్ర మంత్రికి వివరించారు. ఆయుష్మాన్ భారత్ నిబంధనలన్నింటిని తాము ఈ ఏడాది జనవరి నుంచి అమలు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి నడ్డాకు తెలియజేశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకుగానూ 5,159 బస్తీ దవాఖానాలు (ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు) సమర్థంగా నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నందున కేంద్ర ప్రభుత్వం సహకరించాలని, ఎన్‌హెచ్‌ఎం బకాయిలు విడుదల చేయాలని కేంద్ర మంత్రి నడ్డాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఎన్‌హెచ్‌ఎం 2023-24 మూడు, నాలుగు త్రైమాసికాల నిధులు రూ.323.73 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, 024-25 మొదటి త్రైమాసిక గ్రాంట్ రూ.138 కోట్లు మంజూరు చేయాల్సి ఉందని, ఆ మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. ఎన్‌హెచ్‌ఎం కింద చేపట్టిన మౌలిక వసతులు, నిర్వహణ కాంపోనెంట్ కింద 2023-2024 సంవత్సరానికి సంబంధించి రావల్సిన రూ.231.40 కోట్లు తక్షణమే రీయింబర్స్ చేయాలని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఎన్‌హెచ్ ఎంకు సంబంధించి కేంద్రం నుంచి రావల్సిన నిధులు ఆలస్యం కావడంతో అత్యవసర వైద్య సేవలకు అంతరాయం కలగకుండా, సిబ్బందికి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు రాష్ట్ర వాటాతో పాటు కేంద్రం నుంచి రావల్సిన వాటా మొత్తాన్ని 2023, అక్టోబరు నుంచి తామే విడుదల చేస్తున్నామని కేంద్ర మంత్రి నడ్డా దృష్టికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి వెంట మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఢిల్లీలో ప్రభుత్వ ప్రతినిధి ఏ.పి.జితేందర్ రెడ్డి ఉన్నారు.

## కాంగ్రెస్ గూటికి గూడెం మహిపాల్ రెడ్డి

కండువా కప్పుకోగా.. ఎన్నికల ఫలితాల తర్వాత పోచారం, సంజయ్ కుమార్ పార్టీలో చేరారు. గూడెం మహిపాల్ కాంగ్రెస్ లో చేరితే బీఆర్ఎస్ ను వీడిన ఎమ్మెల్యేల సంఖ్య 6 కు చేరుతుంది. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, ఆయన సోదరుడు మధుసూదన్‌రెడ్డి ఇండ్లు, ఆఫీసుల్లో ఇటీవల ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు దాడులుచేశారు. అక్రమ మైనింగ్‌తో రూ.300 కోట్లు కూడబెట్టారని గుర్తించినట్టు తెలిపారు. ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో చెల్లించాల్సిన మరో రూ. 39.08 కోట్లు ఎగవేసినట్టు వెల్లడించారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరినామం

విషయాలు ఈ కేసులో బయటకిరాగా.. తాజాగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి ఎవిడెన్స్ మెటీరియల్ మొత్తాన్ని పోలీసు ఉన్నతాధికారులు కోర్టుకు సమర్పించారు. మూడు బాక్సులలో న్యాయస్థానంలో ఆధారాలు సమర్పించడం జరిగింది. ఇందులో హార్డ్ డిస్కులు, సిడీ, పెన్ డ్రైవ్‌లను పోలీసు కోర్టు ముందు ఉంచారు.‚ ÷నైల్‌గా అన్నిటినీ జత పరుస్తూ పోలీసులు మూడోసారి ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. కాగా.. ఈ ఆధారాలను నిందితులకు తెలీకుండా రహస్యంగా ఉంచాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోరారు. అనంతరం మాజీ అడిషనల్ ఎస్పీల బెయిల్ పిటిషన్ ల పై విచారణ వాయిదా పడింది. ఇదిలా ఉంటే.. బుధవారం నాడు తిరుపతన్న, భుజంగ రావ్ బెయిల్ పిటిషన్‌లపై న్యాయస్థానంలో విచారణ జరగబోంది.

# ప్రజల ఆకాంక్షలు సభలో ప్రతిఫలించాలి

**సభా వ్యవహారాలపై అవగాహన పెంచుకోవాలి**

**మృదువైన, సరళమైన భాషనే మాట్లాడాలి**

**శాఖాపరంగా అవగాహన పెంచుకోవాలి**

**పరుషపదజాలంతో మాట్లాడరాదు**

**పార్టీ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేసిన డిప్యూటీ సిఎం**




విజయవాడ,జూన్25 (ప్రజా మంటలు):
మనపై ప్రజలు ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో ఉన్నారు. భారీ మెజార్టీతో, 100శాతం స్ట్రయిక్ రేట్‌తో గెలిపించి అసెంబ్లీకి పంపించారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలను సభలో ప్రతిఫలింపచేద్దాం‘ అని పార్టీ ఎమ్మెల్యేలకు ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. జనసేన శాసనసభ్యులకు సభా వ్యవహారాలు, నియమావళి, సంప్రదాయాలపై మంగళవారం విజయవాడలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రతీ ఒక్క ఎమ్మెల్యే సభా నియమావళిపై అవగాహన పెంచుకోవాలన్నారు. సభా సంప్రదాయాలు గౌరవిస్తూ నడుచుకోవాలని హితబోధ చేశారు. శాఖాపరమైన అంశాలు, ప్రజా సమస్యలు అధ్యయనం చేసిన తర్వాతే చర్చల్లో పాల్గొనాలని సూచించారు. మహిళల రక్షణ విషయంలో ఎక్కడా రాజీపడవద్దని, గంజాయి, మాదక ద్రవ్యాల నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందన్నారు. పార్టీ నుంచి గెలిచిన వారిలో ఎక్కువ మంది శాసనసభ వ్యవహారాలకు కొత్తవారే. అందరం సభ నియమావళి, సంప్రదాయాలపై అవగాహన తెచ్చుకోవాలి. నియమావళిని పాటిస్తూ సంప్రదాయాలను గౌరవించాలి. సభలో హుందాగా ఉండాలి. మన నడవడిక, చర్చించే విధానం ప్రజల మన్ననలు పొందాలి. తొలి వంద రోజులు పాలనాపరమైన విషయాలపై అవగాహన, అధ్యయనంపై దృష్టి పెట్టాలి. ప్రభుత్వశాఖలు, పాలనాపరమైన విధివిధానాలు, పథకాలు, వాటి అమలు తీరు, సంక్షేమ పథకాలు లబ్దిదారులకు సక్రమంగా చేరుతున్నాయా?లేదా? వంటి విషయాలపై అధ్యయనం చేయాలి. ఆ తర్వాత మీరు చేసే చర్చలు ఎంతో బలంగా ఉంటాయి. విషయాన్ని చెప్పేటప్పుడు భావ తీవ్రత ఉండవచ్చు. భాష సరళంగా, మర్యాదపూర్వకంగా ఉండాలి. అధికారులు, ఉద్యోగులతో మాట్లాడేటప్పుడు, చర్చల్లో పరుష పదజాలం వాడొద్దు. ప్రజలతో గౌరవంగా ఉంటూ వారు తమ బాధలు, సమస్యలు చెబితే జాగ్రత్తగా వినాలని సూచించారు. మన పార్టీ నుంచి గెలిచిన ఎంపీలు, ఎమ్మెల్యేలకు అభినందన కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించాం. ఈ కార్యక్రమం అయిన తరవాత నియోజకవర్గ స్థాయిలో అభినందన కార్యక్రమాలు చేపట్టండి. మీ గెలుపు కోసం తోడ్పడిన కూటమి నాయకులు, మన పార్టీ నాయకులను అభినందించండి. పార్టీ కోసం క్షేత్ర స్థాయిలో నిస్వార్థంగా పని చేసిన జన సైనికులు, వీర మహిళలను, సభలు, కార్యక్రమాల్లో వాలంటీర్లుగా పని చేసిన వారిని గుర్తించండి. వారి కోసం ప్రత్యేకంగా కృతజ్ఞత కార్యక్రమాలు నిర్వహించాలి. వారితో గౌరవభావంతో ఉండాలి. మన పార్టీ శ్రేణులను బలోపేతం చేసే బాధ్యత మీపై ఉంది. ఇలాంటి అవగాహన చర్చలు ప్రతి నెల నిర్వహించుకుందాం. జనసేన పక్షాన చేసిన జనవాణి కార్యక్రమం ఎంతో విజయవంతం అయింది. మీరు కూడా నియోజకవర్గ స్థాయిలో ప్రతి నెలా జనవాణి చేపట్టండి‘ అని పవన్ కల్యాణ్ పార్టీ ఎమ్మెల్యేలకు సూచించారు. ఎప్పటికప్పుడు ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉండాలని, ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గ్రామస్థాయిలో మౌలిక వసతుల కల్పనపై దృష్టిపెట్టాలని, శాంతిభద్రతల పరిరక్షణకు ఎక్కడా రాజీపడొద్దని ఎమ్మెల్యేలకు చెప్పుకొచ్చారు. పార్టీ నుంచి గెలిచిన ఎంపీలు, ఎమ్మెల్యేలకు త్వరలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు పవన్ తెలిపారు. నియోజకవర్గాల వారీగా పర్యటన ఉంటుందని, అందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు.

## జూలై 1న పిఠాపురంలో పవన్ కళ్యాణ్ పర్యటన

**మూడ్రోజుల పాటు అక్కడే మకాం**

**అంతకుముందే జూన్ 29న కొండగట్టుకు రాక**



అమరావతి,జూన్25(ప్రజా మంటలు):
సొంత నియోజకవర్గం పిఠాపురంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటన ఖరారైంది. జులై 1వ తేదీ నుంచి తన నియోజక వర్గం పిఠాపురంలో జనసేనాని పవన్ కళ్యాణ్ పర్యటించనున్నారు. అదేరోజు సాయంత్రం పిఠాపురంలో మంత్రి పవన్ కళ్యాణ్ వారాహి సభ నిర్వహిస్తారు. తనను గెలిపించిన పిఠాపురం నియోజక వర్గ ప్రజలకు ఈ సందర్భంగా పవన్ కృతజ్ఞతలు తెలపనున్నారు. 3 రోజులపాటు పిఠాపురంతోపాటు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పలు అధికారిక కార్యక్రమాలలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పాల్గొంటారని సమాచారం. కాకినాడ జిల్లా అధికారులు, పిఠాపురం నియోజకవర్గ అధికారులతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షిస్తారు. పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేకంగా సమావేశం కావాలని నిర్ణయించారు. అలాగే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కొండగట్టులో పర్యటించనున్నారు. జూన్ 29వ తేదీన పవన్ కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్తారు. అక్కడ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారని జనసేన పార్టీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ వారాహి అమ్మవారి దీక్షలో ఉన్నారు. నేటి నుంచి 11 రోజులపాటు పవన్ కళ్యాణ్ వారాహి అమ్మవారి దీక్ష కొనసాగించనున్నారు.

# ప్రతిపక్ష హోదా ఇవ్వండి

## అప్పుడే సభలో గళమెత్తే అవకాశం ఉంటుంది

## స్పీకర్ అయ్యన్నకు జగన్ సంచలన లేఖ



అమరావతి,జూన్25 (ప్రజా మంటలు): ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడుకి మాజీ సీఎం, వైసీపీ అధినేత వైయస్ జగన్ మోహన్‌రెడ్డి సంచలన లేఖ రాశారు. మంత్రుల తర్వాత తనతో ప్రమాణస్వీకారం అసెంబ్లీ పద్ధతులకు విరుద్ధమని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వకూడదని ముందుగానే నిర్ణయించినట్టు ఉన్నారని జగన్ అన్నారు. విపక్షంలో ఎవరికి ఎక్కువ సీట్లు ఉంటే వారికే ప్రతిపక్ష హోదా ఇవ్వాలని చట్టంలో నిర్వచించారని, ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటే 10 శాతం సీట్లు ఉండాలని చట్టంలో ఎక్కడా లేదని పేర్కొన్నారు. పార్లమెంటులో కానీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కానీ ఈ నిబంధన పాటించలేదన్నారు. అధికారకూటమి, స్పీకర్ ఇప్పటికే నాపట్ల శత్రుత్వాన్ని ప్రదర్శిస్తున్నారని లేఖలో జగన్ పేర్కొన్నారు. చచ్చేదాకా కొట్టాలంటూ స్పీకర్ మాట్లాడిన మాటలు వీడియోల ద్వారా బయటపడ్డాయని, ఇలాంటి నేపథ్యంలో అసెంబ్లీలో గొంతు విప్పే పరిస్థితులు కనిపించడంలేదని అన్నారు. ప్రతిపక్ష హోదాతోనే ప్రజా సమస్యలను బలంగా వినిపించే అవకాశం ఉంటుందని లేఖలో పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీ హోదాతో సభా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు చట్టబద్ధమైన భాగస్వామ్యం లభిస్తుందని, ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని లేఖను పరిశీలించాలని స్పీకర్ అయ్యన్న పాత్రుడిని జగన్ అభ్యర్థించారు.

# కుప్పం చేరుకున్న సిఎం చంద్రబాబు


## ఘనంగా స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు



చిత్తూరు,జూన్ 25(ప్రజా మంటలు): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. తన రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం కుప్పం చేరుకున్నారు. నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సీఎం చంద్రబాబు తొలిసారిగా తన సొంత నియోజకవర్గానికి రావడంతో.. పార్టీ శ్రేణులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికాయి. అనంతరం శాంతిపురం మండలం జెగ్రివానిపల్లె, శాంతిదొడ్డి గ్రామాల్లో ఉన్న హంద్రీ – నీవా కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులను ఆయన పరిశీలించారు. ఆ తర్వాత తిరిగి ఆయన కుప్పానికి చేరుకున్నారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొననున్నారు. సభానంతరం ఆర్ అండ్ బి అతిథి గృహానికి సీఎం చంద్రబాబు చేరుకుని.. పార్టీ నేతలో సమావేశం కానున్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా సొంత నియోజకవర్గానికి రావడంతో చంద్రబాబుకు జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలంతా కలిసి ఘనస్వాగతం పలికారు. అలాగే చంద్రబాబు పర్యటన నేపథ్యంలో కుప్పం పసుపు మయంగా మారింది. మరోవైపు ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లును జిల్లా ఉన్నతాధికారులు పూర్తి చేశారు. అందులోభాగంగా కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకున్నారు

# సజ్జల కనుసన్నల్లో గనుల దోపిడీ

## సిఐడికి అందిన ఫిర్యాదు



నెల్లూరు,జూన్25(ప్రజా మంటలు): వైకాపా ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, ఆయన అనుచరులపై సీఐడీకి ఫిర్యాదు అందింది. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన గనుల యజమాని బద్రీనాథ్ సీఐడీ డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. సజ్జల రామకృష్ణారెడ్డి కనుసన్నల్లో గనులు దోచేశారని ఆరోపించారు. 'సజ్జల అనుచరులు శ్రీకాంత్‌రెడ్డి, ధనుంజయ్‌రెడ్డి దౌర్జన్యం చేశారు. అదూరు శ్రీచరణ్, కృష్ణయ్యను అడ్డుపెట్టుకుని అక్రమాలకు పాల్పడ్డారు. సైదాపురం మండలం జోగుపల్లిలో మాకు 240 ఎకరాలు ఉంది. అక్కడ 8 గనులు ఉన్నాయి. రెండేళ్లుగా మా పొలాల్లోని గనులను అక్రమంగా దోచేశారు. 500 నుంచి 800 కోట్ల టన్నులు తవ్వేసి రూ.వేలకోట్లు దోచుకున్నారు. లక్షల టన్నుల క్వార్ట్జ్‌ను మార్కెట్‌లో అక్రమంగా విక్రయించారు. దీనిపై ప్రశ్నిస్తే కేసులు పెడతామని బెదిరించారు. హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘించి అక్రమాలకు పాల్పడ్డారు' అని సీఐడీకి ఇచ్చిన ఫిర్యాదులో బద్రీనాథ్ పేర్కొన్నారు.

## వాసుదేవరెడ్డి పిటిషన్ విచారణ నుంచి తప్పకున్న జడ్జి

అమరావతి,జూన్25 (ప్రజా మంటలు): ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ నుంచి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస్‌రెడ్డి వైదొలిగారు. 'నాట్ బిఫోర్ మీ' అంటూ ఆయన తప్పుకొన్నారు. ఆ పిటిషన్‌ను వేరే బెంచ్‌కు పంపాలని రిజిస్ట్రీని ఆదేశించారు. వైకాపా హయాంలో బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా వాసుదేవరెడ్డి పనిచేశారు. కీలక డాక్యుమెంట్లను మాయం చేశారనే ఆరోపణలు రావడంతో సీఐడీ కేసు నమోదు చేసింది. దీంతో ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

## మాజీ ఎంపి ఎంవివిపై కేసు నమోదు

విశాఖపట్టణం,జూన్25 (ప్రజా మంటలు): వైకాపా మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణపై కేసు నమోదైంది. ఆయనతో పాటు ఆడిటర్ గన్నమనేని వెంకటేశ్వరరావు, రియల్టర్ గద్దె బ్రహ్మాజీపైనా విశాఖ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎంవోయూ పేరిట ఖాళీ పత్రాలపై సంతకాలు పెట్టించుకున్నారంటూ హయగ్రీవ కన్‌స్ట్రక్షన్ అధినేత జగదీశ్వరుడు ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విలువైన భూములను కాజేసే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. దీంతో ఈనెల 22న పోలీసులు నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దీంతో ఎంవీవీ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు.

# నామినేటెడ్ పోస్టుల భర్తీపై దృష్టి

## అర్హులకు పదవులు కట్టబెట్టే యోచనలో బాబు - త్వరలోనే మొదలు కానున్న పందేరం

అమరావతి,జూన్25 (ప్రజా మంటలు): ముఖ్యమంత్రి చంద్రబాబు నామినేటెడ్ పోస్టుల భర్తీపై దృష్టి పెట్టారు. పార్టీకోసం పనిచేసిన వారు కూడా పదవుల కోసం ఎదురు చూస్తున్నారు. మంత్రివర్గంలో చోటుదక్కని వారు సైతం పదవుల కోసం చూస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అప్పటి ప్రభుత్వ వేధింపులు తట్టుకొని ప్రజల తరపున పోరాటాలు చేస్తూ పార్టీకి అండగా ఉన్న వాళ్లకే ఈసారి నామినేటెడ్ పోస్టులు దక్కుతాయని స్పష్టం చేశారు. దీని కోసం ప్రత్యేక విధానం ద్వారా క్షేత్రస్థాయి రిపోర్టు తెప్పించుకుంటున్నానని తెలిపారు. వివరాలు వచ్చిన తర్వాత మరోసారి వడపోసి ఇంకా మిస్ అయిన వాళ్లు ఉంటే వారికి న్యాయం చేసేలా ఈ భర్తీ పక్రియ ఉంటుందని అన్నారు. టీడీపీ ప్రజాప్రతినిధులు, అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, పార్టీలోని ఇతర ముఖ్య నేతలతో చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన చంద్రబాబు కీలక అంశాలు ప్రస్తావించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారంతో విర్రవీగి టీడీపీ నేతలను హింసించిన ఇబ్బంది

పెట్టిన వారికి ఎంట్రీ లేదన్నారు చంద్రబాబు. అలాంటి వాటిని పార్టీలో చేర్చుకోబోమని స్పష్టం చేశారు. ప్రతి శనివారం పార్టీ నాయకుల సమస్యలను తానే స్వయంగా వింటానని వారి నుంచి వినతి పత్రాలు తీసుకుంటానని వెల్లడించారు. ఐదేళ్ల పాటు పోరాటం ఒక ఎత్తు అయితే పొత్తులో భాగంగా సీట్లు లేకపోయినా కూటమిక కోసం చాలా మంది నేతలు శ్రమించారని వారిని ప్రత్యేకంగా గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు చంద్రబాబు. అలాంటి వారి వల్లే ఇంతటి ఘన విజయం సాధించగలిగామని గెలిచిన వారంతా గుర్తు పెట్టుకోవాలని సూచించారు. గ్రామస్థాయి శ్రేణులంతా పార్టీ ఎలాంటి కార్యక్రమానికి పిలుపునిచ్చినా అప్పటి వేధింపులను ఎదుర్కొని విజయవంతం చేశారని కితాబు ఇచ్చారు. అలాంటి పోరాటాలు చేసిన వారికి ఈసారి కచ్చితంగా గుర్తింపు ఉంటుందన్నారు చంద్రబాబు. వివిధ మార్గాల్లో పార్టీ విజయానికి నిజాయితీగా కష్టపడే వాళ్ల వివరాలు తెలుసుకుంటున్నట్టు తెలిపారు. పార్టీ నేతలు చెప్పిన వివరాలు తీసుకోవడంతోపాటు వేరే మార్గాల్లో కూడా కింది స్థాయి నేతల శ్రమను బేరీజు వేసి నిజంగా కష్టపడేవాళ్లకు పదవులు వచ్చేలా చూస్తామన్నారు చంద్రబాబు. పని చేసేవాళ్లకే పదవులు అనే విధంగా ఇకపై నిర్ణయాలు ఉంటాయన్నారు చంద్రబాబు. ఇప్పటి నుంచి 2029 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రణాళికలు ఉండాలని సూచించారు. ప్రభుత్వం చేసిన పనులను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని... వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని శ్రేణులకు సూచించారు. ఇచ్చిన హామీల్లో ప్రధానమైన ఐదింటిని మొదటి విడతలోనే ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం టీడీపీ శ్రేణులనే కాకుండా ప్రజలను కూడా ఇబ్బంది పెట్టిందన్నారు. పింఛన్లు నేరుగా ఇంటికి ఇవ్వకుండా హింసించిందని వలంటీర్లు లేరన్న కారణంతో బ్యాంకుల చుట్టూ తిప్పిందని విమర్శించారు చంద్రబాబు. సచివాలయ సిబ్బందితో పింఛన్లు ఇవ్వడం అసాధ్యం కాదు సాధ్యమని చెప్పడానికే తామువారితో ఈసారి పింఛన్లు పంపిణీ చేస్తున్నట్టు వెల్లడించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు మాట ఇచ్చినట్టుగానే బీసీలకు ఉన్నతమైన పదవుల్లో ఉంచినట్టు గుర్తు చేశారు. బీసీ వర్గానికి చెందిన పల్లా శ్రీనివాసరావుకు టీడీపీ అధ్యక్ష పదవి అప్పగించామని, మరో బీసీ అయిన అయ్యన్న పాత్రుడికి స్పీకర్ పదవిలో కూర్చోబెట్టామన్నారు చంద్రబాబు భవిష్యత్‌లో కూడా ఇలాంటి చాలా ఉంటాయని ఆ దిశగానే కసరత్తు జరుగుతోందని పేర్కొన్నారు.

## టెట్ అభ్యర్థులకు లోకేశ్ శుభాకాంక్షలు

అమరావతి,జూన్25 (ప్రజా మంటలు): ఏపీ టెట్ ఫలితాలను రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. ఈ పరీక్షల్లో క్వాలిఫై అయిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. మెగా డీఎస్సీకి టెట్ అర్హత, 20శాతం వెయిటేజీ ఉండటంతో రాష్ట్ర వ్యాప్తంగా 2.35లక్షల మందికి పైగా అభ్యర్థులు ఎంతో ఆతృతగా ఈ ఫలితాల కోసం ఎదురు చూశారని ఆయన తెలిపారు. తమ ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీకి సన్నద్ధమవుతున్న అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. ఈ టెట్‌లో అర్హత సాధించని వారు నిరాశకు గురి కావొద్దని 'ఎక్స్' వేదికగా విజ్ఞప్తి చేశారు. వీరంతా.. కొత్తగా బీఈడీ, డీఎడ్ పాసైన అభ్యర్థులతో పాటు అతి త్వరలోనే నిర్వహించబోయే టెట్‌కు, మెగా డీఎస్సీకి దరఖాస్తు చేసుకోవచ్చని లోకేశ్ సూచించారు.

## నగదును రెట్టింపు చేస్తామని బురిడీ

## ముఠాను అరెస్ట్ చేసిన పోలీసులు

నల్లగొండ,జూన్25(ప్రజా మంటలు): నగదును రెట్టింపు చేస్తామని మోసం చేస్తున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా చందనపల్లి గ్రామంలో ఈ నెల 22న ఆర్ఎంపీ వైద్యుడు శ్రీరామోజు రామాచారిని ముఠా సభ్యులు కలిశారు. మీ దగ్గర ఉన్న నగదు రెట్టింపు చేస్తామని నమ్మించారు. కాగా, బీహార్ రాష్ట్రానికి చెందిన రామ్ నరేష్ యాదవ్ గతంలో చందనపల్లి గ్రామంలో తాపీ మేస్త్రీగా పని చేసాడు. ఆ సమయంలో చందనపల్లి గ్రామానికి చెందిన శ్రీరామోజు రామాచారి ఇల్లును కట్టడంతో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. దీంతో వారి మాటలు నమ్మాడు. రామాచారి వద్ద నుంచి రూ.33లక్షలు తీసుకొని ముగ్గురు వ్యక్తులు పరారయ్యారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నల్లగొండ రైల్వే స్టేషన్‌లో బీహార్‌కు చెందిన నిందితులు సిరాజ్, నరేష్ యాదవ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి రూ.24 లక్షలు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

# డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలి

శ్రీకాకుళం,జూన్25 (ప్రజా మంటలు): గ్రామాలలో డెంగ్యూ వ్యాధి ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచించారు. దీనికి సంబంధించి వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ముఖ్యంగా గిరజన గ్రామాల ప్రజలు దోమల వ్యాప్తి లేకుండా చూసుకోవాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నందున బోర్లు, తాగునీటి బావులు, డ్రైనేజ్‌లు వద్ద పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. దోమల నివారణకు మలాథిన్ ద్రావణం పిచికారి చేయాలని సూచించారు.

## నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాల్సిందే

## విశాఖలో ఎస్ఎఫ్ఐ ర్యాలీ




విశాఖపట్టణం,జూన్25 (ప్రజా మంటలు): నీట్ పరీక్షలు మళ్ళీ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం విశాఖలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. జీవీఎంసీ విగ్రహం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ.. నీట్ పరీక్ష సరిగా నిర్వహించలేని ఎన్‌టిఏ ను రద్దు చేయాలని నీట్ పరీక్ష పేపర్ లికేజ్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్య శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. నీట్, యూజీ, పీజీ నిర్వహణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాలని, బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విశాఖపట్నం లో ర్యాలీ నిర్వహించారు. ముందుగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం అక్కడ నుంచి ఆసీలమెట్ట జంక్షన్, ఆర్టిసి కాంప్లెక్స్, గురజాడ జంక్షన్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ కార్యదర్శి పి.అజరు, అధ్యక్షుడు జి.రాము, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యు.ఎస్.ఎన్ రాజు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్, నెట్ పరీక్ష పేపర్ల లీకేజీలు దుర్మార్గమన్నారు. దీనివల్ల వేలాదిమంది విద్యార్థులకు అన్యాయం జరిగిందన్నారు. బాధ్యత విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. ఎన్‌టిఏ ను రద్దు చేయాలన్నారు. పేపర్ లీకేజీ కి బిజెపి, మోడీ ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశ ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలన్నారు. నీట్, యుజీ, పిజి పరీక్షల నిర్వహణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు.

# రాష్ట్రవ్యాప్తంగా వైసిపి కార్యాలయాలకు నోటీసులు

## అక్రమంగా నిర్మించిన వాటికి తాఖీదులు జారీ

విజయవాడ,జూన్25 (ప్రజా మంటలు): రాష్ట్రవ్యాప్తంగా వైసిపి కార్యాలయాల అక్రమ నిర్మాణాలపై అధికారులు రంగంలోకి దిగారు. నోటీసులు ఇస్తున్నారు. బాపట్ల పట్టణంలో వైసీపీ జిల్లా కార్యాలయానికి నోటీసులు ఇచ్చారు. జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణ పేరుతో నోటీసులు జారీ చేశారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో నోటీసును ఆఫీస్ గోడకు మున్సిపల్ సిబ్బంది అంటించారు. అలాగే సిబ్బంది మోపిదేవికు రిజిస్టర్ పోస్టులో నోటీసులు పంపించారు. ఎలాంటి అనుమతులు లేకుండా భవనం నిర్మాణం చేశారంటూ బాపట్ల మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. అలాగే పల్నాడు జిల్లా, వైసీపీ కార్యాలయంకు ఉడా, లింగంగుంట్ల పంచాయతీ అధికారులు నోటీసులు పంపారు. అనుమతులు లేకుండా భవనం నిర్మాణం చేపట్టారని ఆ నోటీసులో పేర్కొన్నారు. కార్యాలయంకి వచ్చి సమాధానం చెప్పాలన్నారు. నరసరావుపేట మండలం, లింగంగుంట్ల వద్ద అనుమతులు లేకుండా వైసీపీ జిల్లా కార్యాలయం కట్టారు. ఃూగా విజయనగరంలో వైసీపీ కార్యాలయ నిర్మాణం మలుపు తిరిగింది. నిన్నటి వరకు నిర్మాణపనుల్లో కార్మికులు తలమునకలై ఉన్నారు. అయితే వైసీపీ కార్యాలయాల అక్రమ నిర్మాణాలపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో విజయనగరంలోని వైసీపీ కార్యాలయ నిర్మాణానికి కార్పొరేషన్ అధికారులు అనుమతులు లేవని నోటీసులు అతికించారు. దీంతో కార్మికులు పనులు నిలిపివేశారు. గంటల వ్యవధిలోనే వైసీపీ నేతలు ఆ నోటీసులను పీకేసారు. జగన్ ప్రభుత్వం ఉన్నప్పుడు కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను వైసీపీ కార్యాలయాల నిర్మాణాల కోసం రాష్ట్రవ్యాప్తంగా కారుచౌకగా లీజుకు తీసుకున్నారు. అనుమతులు లేకుండానే జిల్లా కేంద్రాల్లో నిర్మాణాలు చేపట్టారు. 18 జిల్లాల్లో వైసీపీ కార్యాలయాల భవనాలకు స్థానిక సంస్థల నుంచి అనుమతులు తీసుకోలేదు. శ్రీకాకుళం, అనకాపల్లి, పార్వతీపురం, కాకినాడ, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, తాడేపల్లి, నరసరావుపేట, బాపట్ల, నెల్లూరు, నంద్యాల, కడప, అన్నమయ్య, అనంతపురం, పుట్టపర్తి, తిరుపతిలో భవన నిర్మాణాల అనుమతుల కోసం దరఖాస్తు కూడా చేయలేదు. విశాఖ, విజయనగరం, మచిలీపట్నం, కర్నూలులో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసినా.. వాటికి ఇంకా అనుమతులు రాలేదు. ఒక్క ఒంగోలులోనే అన్ని అనుమతులు తీసుకుని వైసీపీ జిల్లా కార్యాలయాన్ని నిర్మించారు. అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, చిత్తూరు జిల్లాల్లో వైసీపీ కార్యాలయాల నిర్మాణాల కోసం కేటాయించిన భూములు ఖాళీగానే ఉన్నాయి. సాధారణంగా భవన నిర్మాణాలు చేపట్టే ముందు స్థానిక సంస్థల అనుమతులు తీసుకుంటారు. అధికారంలో ఉన్నామన్న ధీమానో ఏమో కానీ వైసీపీ కార్యాలయాల నిర్మాణాల కోసం స్థానిక సంస్థల నుంచి ఎలాంటి అనుమతులూ తీసుకోలేదు.ముఖ్యమంత్రిగా జగన్ అధికారపగ్గాలు చేపట్టిన కొత్తలో ప్రజా వేదికకు అనుమతులు లేవంటూ కూల్చివేయించారు. అనుమతులు లేని కార్యాలయంలో కలెక్టర్లు, ఎస్పీలు, సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, మంత్రులతో కూర్చుని ముఖ్యమంత్రి హోదాలో సమీక్షలు నిర్వహించడం ఏమిటంటూ అప్పట్లో జగన్ వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా అనుమతులు లేని కట్టడాలను కూల్చేస్తామని ప్రకటించారు. అయితే అక్రమ కట్టడాల పేరిట ప్రతిపక్ష నేతలను వేధించారు. పలువురు నేతలకు చెందిన కట్టడాలను కూల్చేశారు. కానీ ఎలాంటి అనుమతులు తీసుకోకుండా వైసీపీ కార్యాలయాల భవనాల నిర్మాణాలు చేపట్టారు. జగన్ ప్రభుత్వంలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు శంకుస్థాపనలు, ఇతర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మరి జగన్ చెప్పిన నిబంధనలు ఈ భవనాలకు వర్తించవా? ఆయన చెప్పినట్టు ఈ అక్రమ కట్టడాలనూ కూల్చివేయాలి కదా?స్థానిక సంస్థలు అనుమతులు లేని భవనాలకు నోటీసులు జారీ చేస్తున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు అనుమతులు తీసుకోకుండా నిర్మాణాలు చేపట్టిన వైసీపీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందంటూ నిందిస్తోంది. తన తప్పులు కప్పిపెట్టి చంద్రబాబు ప్రభుత్వంపై బురదజల్లాలని చూస్తోంది. అక్రమ నిర్మాణాలను కూల్చేస్తుంటే జగన్, ఆయన రోత పత్రిక గతాన్ని మరిచి అన్యాయమంటూ గగ్గోలు పెడుతున్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతుందని జగన్ భావించారు. కానీ వాస్తవ విషయాలను ప్రజలు గుర్తించడంతో వ్యతిరేకత రావడం లేదు. దీంతో వైసీపీకి పాలుపోవడం లేదు. కిందస్థాయి నేతలు కూడా అక్రమ కట్టడాల కూల్చివేతలపై నోరు మెదపలేకపోతున్నారు. గతంలో చేసిన తప్పులకు వైసీపీ ఇప్పుడు మూల్యం చెల్లిస్తోంది. విజయనగరం, పుట్టపర్తిలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న వైసీపీ జిల్లా కార్యాలయాలకు స్థానిక సంస్థలు నోటీసులు జారీ చేశాయి. విజయనగరం నడిబొడ్డున దాసన్నపేట రింగురోడ్డును ఆనుకుని నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయం భవనానికి సోమవారం టౌన్ ఎ÷-లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేశారు. భవనం గోడకు నోటీసులను అతికించారు. సర్వే నంబరు 569లో చేపడుతున్న నిర్మాణానికి అనుమతులు లేవని అందులో పేర్కొన్నారు. వెంటనే నిర్మాణ పక్రియ ఆపాలని, వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న వైసీపీ జిల్లా కార్యాలయ భవనాన్ని ఎందుకు కూల్చివేయకూడదో చెప్పాలంటూ పుట్టపర్తి పురపాలక సంఘం టౌన్ ఎ÷-లానింగ్ విభాగం అధికారులు నోటీసులు జారీ చేశారు. పార్వతీపురంలో ఎటువంటి అనుమతి లేకుండా నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయానికి సంబంధించి నోటీసులు జారీ చేస్తామని పట్టణ టౌన్ఎ÷-లానింగ్ అధికారి తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారులు ఆ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలం వివరాలు సేకరించామని చెప్పారు. నోటీసులను జారీ చేసేందుకు అవసరమైన పక్రియను ప్రారంభించామని వెల్లడించారు. ఏదేమైనా వైసీపీ కార్యాలయ భవనం విషయంలో అధికారులు ఏ విధంగా వ్యవహరిస్తారో వేచి చూడాల్సి ఉంది.

# దేశం ముందు ఎమర్జెన్సీని మించిన సవాళ్లు !

కొత్తగా మూడోసారి ప్రధానిగా అవకాశం దక్కించుకున్న నరేంద్ర దామోదర దాస్ మోడీ..మాట తీరులో మార్పు కనిపించడం లేదు. పనితీరులోనూ మార్పు వస్తుందని అనుకోవడం కూడా భ్రమే అవుతుంది. ఇంకా పాత విషయాలను పట్టుకుని వేలాడుతూ.. కాంగ్రెస్ లక్ష్యంగా విమర్శలతో ముందకు సాగాలని అనుకుంటున్నట్లు తొలిరోజు పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఎమర్జెన్సీపై చేసిన వ్యాఖ్యలతో స్పష్టం అవుతోంది. ఆయన చేపట్టిన కాంగ్రెస్ ముక్త భారత్ నినాదం ఇప్పటికే బెడిసి కొట్టింది. తన పదేళ్ల కాలంలో దెబ్బతిన్న రంగాలను, ప్రజల గురించి ఆలోచించి, వాటిని సరిదిద్దుతానని చెప్పడం లేదు. ప్రధానంగా దేశం ఆర్థికంగా కుదేలయ్యింది. డాలర్ మారకం రేటు పెరుగుతోంది. నిరుద్యోగం పెరుగుతోంది. అగ్నిపథ్ పథకం పై దేశవ్యాప్తంగా అసంతృప్తి ఉంది. జిఎస్టీ భారాలు తట్టుకోలేక పోతున్నారు. వ్యవసాయానికి చేయూత కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. నిత్యావసర ధరలు అమాంతంగా పెరిగాయి. పదేళ్లయినా మోడీ ఇలాంటి సమస్యలపై మాట్లాడడం లేదు. అధికార, విపక్షాలు తమ రాజకీయాల కోసం ప్రజలు బలిపశువులుగా చేసి ఆడుకుంటున్నారు. ఇందిరా గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దేశంలో ఎమర్జెన్సీని విధించి మంగళవారం తో 50 ఏళ్లు పూర్తవుతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎమర్జెన్సీ ఓ మచ్చ అని ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలు ఇంకా అవసరమా అన్నది ప్రజలు చర్చించాలి. పదేళ్లుగా మోడీ ఏటా ఇది వల్లె వేస్తూనే ఉన్నారు. ప్రజలు తమ విధానాలను విశ్వసించారని మోడీ చెప్పుకోవడం ఇంకా సిగ్గుచేటు. ఫలితాలను విశ్లేషిస్తే మోడీ పాలనా తీరుపై ప్రజలు అంకుశం దింపారు. ఇది గుర్తెరిగి దేశానికి మూడోసారి సేవ చేసే అదృష్టాన్ని కల్పించారని ఆనందపడాలి. అందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలపడం కాదు..ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తానని చెప్పాలి. ఇంకా ఎమర్జెన్సీ, కాంగ్రెస్ పాలన అంటూ సాగితే ప్రజలు క్షమించరని గుర్తించాలి. గత పదేళ్ల పాపాలను కడుక్కుని ప్రజలకు మెరుగైన పాలన అందించాలి. ఇప్పుడు ఉన్నది బిజెపి పాలన కాదని, ఎన్‌డిఎ పాలన అని మోడీ గుర్తిస్తే మరీ మంచిది. సరికొత్త విశ్వాసంతో తాజాగా సమావేశాలను ప్రారంభిస్తున్నామని, ఈ ఐదేళ్లపాటు రాజ్యాంగాన్ని గౌరవిస్తూ నిర్ణయాలు తీసుకుం టామని మోడీ స్పష్టం చేశారు కనుక అందుకు అనుగుణంగా ముందుకు సాగాలి. స్వాతంత్ర్యానంతరం వరుసగా మూడోసారి ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కడం గొప్ప విషయంగా భావించాలి. ప్రజలు బాధ్యతాయుతమైన ప్రతిపక్షాన్ని కోరుకుంటున్నారని అంటున్న మోడీ అందుకు తగ్గట్లుగా విపక్షాలను కూడా గౌరవించాలి. వారు ప్రజల పక్షాన పోరాటం చేసినప్పుడు సమస్యలను గుర్తించాలి. గతంలో ప్రతిపక్షాలను బుల్‌డోజ్ చేశారు. ఇప్పుడా పరిస్థితి ఉండకపోవచ్చు. ప్రజాస్వామ్య మర్యాదను కాపాడేలా, సామాన్య పౌరుల ఆకాంక్షలకు అనుగుణంగా విపక్షాలు నడుచుకోవాలని అంటున్న మోడీ..తనకూ అదే సూత్రం వర్తిస్తుందని గుర్తించాలి. ప్రధాని మోదీ 50 ఏళ్ల కిందటి ఎమర్జెన్సీ గురించి ఇప్పుడు మాట్లాడు తున్నారని, కానీ, గత పదేళ్లలో అప్రకటిత ఎమర్జెన్సీ గురించి ఆయన మర్చిపోయారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే చేసిన వ్యాఖ్యలు గమనార్హం. నీట్ ఆందోళనలు, పశ్చిమ బెంగాల్లో రైలు ప్రమాదం, మణిపూర్‌లో కొనసాగుతున్న అశాంతిపై ఆయన మాట్లాడాలని దేశం కోరుకుంటోందని వ్యాఖ్యానించారు. మోదీకి వ్యతిరేకంగా ప్రజలు తీర్పు ఇచ్చారని అన్నారు. పార్లమెంటు లోపల, బయట ప్రజల గళాన్ని వినిపిస్తూనే ఉంటామన్నారు. ఇకపోతే పార్లమెంట్ కొత్త భవనంలో 18వ లోక్‌సభ కొలువుదీరింది. ఈ భవనంలో లోక్‌సభ సభ్యుల ప్రమాణ స్వీకారం జరగడం ఇదే తొలిసారి. విపక్ష కూటమి 'ఇండియా' నేతలు తొలిరోజే తమ ఐకమత్యాన్ని చాటుకునే ప్రయత్నం చేశారు. లోక్‌సభలో తమకు కేటాయించిన చోట ముందు వరసలోనూ కూటమి పార్టీల నేతలు కూర్చున్నారు. తొలుత వారంతా పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. రాజ్యాంగ ప్రతులను చేతబట్టుకుని, లోక్‌సభకు కలిసి వెళ్లారు. ప్రధాని మోదీ ప్రమాణ స్వీకారం సమయంలో రాహుల్‌గాంధీ సహా.. ఇండియా కూటమి నేతలు రాజ్యాంగ ప్రతులను గాల్లోకి ఊపారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రమాణ స్వీకార సమయంలో.. 'నీట్.. నెట్'.. 'నీట్ షేమ్' అంటూ నినాదాలు చేశారు.నీట్ అక్రమాలపై చర్చించాలని ప్రతిపక్ష సభ్యులు పట్టుపట్టారు. మరోవైపు.. ప్రొటెం స్పీకర్‌గా పార్లమెంట్‌కు ఎక్కువ సార్లు ఎన్నికైన వారికి అవకాశమివ్వాలి. అయితే.. సీనియర్ ఎంపీలున్నా.. బీజేపీ ఉద్దేశపూర్వకంగా భర్తృహరి మెహతాబ్‌ను నియమించడంపై ముందు నుంచి ఇండియా కూటమి అభ్యతరం వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలో.. ప్రొటెం స్పీకర్ ప్యానెల్‌లో నియమితులైన కాంగ్రెస్ సభ్యుడు కొడికున్నిల్ సురేశ్, డీఎంకే సభ్యుడు టీఆర్ బాలు, తృణమూల్ ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ్.. భర్తృహరి నియామకాన్ని నిరసిస్తూ వాకౌట్ చేశారు. ఇండియా కూటమి నేతలు ప్రొటెం స్పీకర్ నియామక తీరు రాజ్యాంగ ఉల్లంఘనేనంటూ నిరసన తెలిపారు. భర్తృహరి కంటే.. కాంగ్రెస్ ఎంపీ కె.సురేశ్ సీనియర్ అని వివరించారు. దళితుడైనందువల్లే సురేశ్‌కు అవకాశమివ్వలేదని ఆరోపించారు. ఇలాంటి చిన్న విషయాల్లో కూడా ఉదారంగా ఉండడం అసవరం. ఒకవేళ సురేశ్ సీనియర్ అయివుంటే గౌరవించి ఉండాల్సింది. ఇకపోతే ఇప్పటికే మంత్రివర్గంలో మెజార్టీ పోర్టుఫోలియోలన్నీ బిజెపి నేతలే చేపట్టారు. ఈ క్రమంలో స్పీకర్ విషయంలోనూ మోడీ నిరంకుశం బయటపడింది. మరోమారు ఓం బిర్లానే ఆయన ఎంపిక చేసుకున్నారు. లోక్‌సభలో బిజెపి బలం తక్కువగా ఉన్నందు వల్ల మోడీ ముందుచూపుతో ఓంబిర్లాకు అవకాశం ఇచ్చివుంటారు. ఎన్‌డిఎ పక్షాలు పట్టుబట్టివుంటే ఇలా జరిగేది కాదు. అలాగే అనేక సమస్యల విషయంలో ఎన్‌డిఎ పక్షాలు కప్పదాటు వైఖరిని వదిలి గట్టిగా నిలబడాలి. దేశం కోసం తమ గొంతు ఎత్తాలి. అప్పుడే మెరుగైన పాలనను చూస్తాం. మోడీ నిరంకుశాన్ని తగ్గించగలుగుతాం. ఇది గుర్తించి విపక్షాలుకూడా ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించి, ప్రజల సమస్యలపై పోరాడితే మంచిది.




## కథల రచయితలకు ఆహ్వానం

గత రెండున్నార సంవత్సరాలుగా "ప్రజా మంటలు" జాతీయ దినపత్రికలో ప్రతిరోజూ ఒక పిల్లల కథను ప్రచురిస్తున్నవిషయం తెలిసిందే. రెండు తెలుగు రాష్ట్రాలలోని పేరున్న రచయితలతో పాటుగా, కొత్త రచయితలు, విద్యార్థులు కూడా తమ కథలను పంపుతున్నారు. ఒక రచన ప్రచురించడానికి కనీసం 20-30 రోజులు పడుతుందని గ్రహించండి. ప్రచురణ విషయంలో ఉత్తరప్రత్యుత్తరాలకు తావు లేదు. మీ రచనలను నెట్ బ్రౌజింగ్ చేసుకొని www.prajamantalu.com లో ప్రతి రోజు చదువుకోండి. మీరు కూడా మీ కథలను హామీ పత్రంతో, ఈమెయిల్ కు పంపండి.
mantalukathalu@gmail.com

# గొప్ప స్నేహం



జక్కన్న,పాపన్న ఇద్దరూ మంచి స్నేహితులు,అంతకు మించి ఉత్తమ కళాకారులు.
జక్కన్న శిల్ప కళాకారుడు. పాపన్న చిత్రకళాకారుడు.
ఇద్దరూ అనేక దేశాలు సందర్శించి అక్కడి శిల్ప కళను, చిత్ర కళలనూ చూసి అధ్యయనం చేయాలని అనుకున్నారు. అలా వారు దేవగిరి రాజ్యానికి వెళ్ళారు. అక్కడి అనేక శిల్పాలు అధ్భుతంగా ఉన్నాయి. నగరం మధ్యకు వచ్చేసరికి దేవగిరి రాజు అగ్నివర్ణుడు గారి విగ్రహం గుర్రం మీద కూర్చున్నట్టుగా ఉంది కానీ,రాజుగారి ముక్కులో ఏదో లోపం ఉంది.

జక్కన్న దానిని నిశితంగా పరిశీలించి పాపన్నతో, "చూశావా పాపన్నా శిల్పంలో రాజుగారి ముక్కును గమనించు. శరీర శాస్త్రం ప్రకారం ఆవిధంగా ఉండకూడదు కదా!" అని కాస్త గట్టిగా అన్నాడు.

"అవునవును అది ఖచ్చితంగా లోపమే" అని పాపన్న అన్నాడు.

వారిద్దరూ ఆ విధంగా మాట్లాడుకోవడం కొంచెం దూరంలో నిలుచుని ఉన్న రాజుగారి వేగు ఒకడు విన్నాడు.

మీరిద్దరూ ఎవరు? మారాజుగారి విగ్రహాన్ని విమర్శించడం ఈరాజ్యంలో పెద్దతప్పు,ఈ విషయం మీకు తెలియదా?" అని గద్దించి అడిగాడు.

"అయ్యా,మేము శిల్పగిరి రాజ్యానికి చెందిన కళాకారులం,నేను శిల్ప కళలో,ఇతను చిత్ర కళలో కళాకారులం, శిల్పంలో నేను గమనించిన లోపాన్ని గురించి మాత్రమే మాట్లాడాను,రాజు గారిని కించ పరచలేదు" చెప్పాడు జక్కన్న.

" ఏది ఏమయినా,మీరు రాజుగారి విగ్రహాన్ని విమర్శించారు.మిమ్మల్ని రాజుగారి వద్దకు తీసుకవెళ్ళాల్సిన ఉద్యోగ ధర్మం నాది" చెప్పాడు వేగు.

"సరే పదండి" అని వేగుతో రాజుగారి వద్దకు వెళ్ళారు.

వేగు రాజుగారికి జక్కన్న,పాపన్నను గురించి చెప్పి,వారు విగ్రహాన్ని విమర్శించిన తీరును గురించి చెప్పాడు.

"నన్ను గురించిగానీ,నా విగ్రహాన్ని గురించి గానీ చులకనగా మాట్లాడటం నా రాజ్యంలో చాలాతప్పు, అది నేను సహించలేను.అందుకని మొదటగా నా విగ్రహాన్ని విమర్శించిన జక్కన్నకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తున్నాను"అని చెప్పాడు.

" మహారాజా మేము తెలియక మీ విగ్రహంలో తప్పు ఎత్తి చూపాము,అంతేకానీ మిమ్మల్ని కించపరచలేదు, క్షమించండి" అని వేడుకున్నారు ఇద్దరూ.

" మా రాజ్యంలో క్షమాపణకు వీలులేదు, శిక్ష అనుభవించాల్సిందే" అని రాజు కర్కశంగా చెప్పాడు.

" అయ్యా, ఇంటికి వెళ్ళి నా భార్యా, బిడ్డలను చూసి వారి భుక్తికి కొంత వీలు కల్పించి వస్తాను" అన్నాడు జక్కన్న.

" నిన్ను ఎలా నమ్మగలం? సరే నీవు వెళ్ళి రెండురోజుల్లో వచ్చేయ్,నీవు రాకపోతే నీకు వెయ్యాల్సిన శిక్షను నీ స్నేహితుడు పాపన్నకు వేస్తాను" చెప్పాడు రాజు.

"పరవా లేదు, ఆ శిక్ష నాకు వెయ్యండి నాకు పెండ్లి కాలేదు,అతనికున్న భాధ్యతలు నాకులేవు,అతన్ని వెళ్ళనివ్వండి" అన్నాడు పాపన్న.

స్నేహితుడి కోసం పరితపిస్తున్న పాపన్న మాటలకు అగ్నివర్ణ రాజు ఆశ్చర్య పోయాడు.

"వద్దు మహారాజా, నేను త్వరగా వచ్చి శిక్ష అనుభవిస్తాను,అతన్ని శిక్షించకండి" అని చెప్పి జక్కన్న బయలుదేరాడు.

ఒకటిన్నర రోజు అయినా జక్కన్న రాలేదు.

" నీ స్నేహితుడు నిన్ను బలిపశువుని చేసి తాను తప్పించుకున్నాడు'' అని ఎగతాళిగా అన్నాడు రాజు.

" మా జక్కన్న అటువంటివాడుకాదు,ఎట్టి పరిస్థితుల్లోనూ తిరిగి వస్తాడు,మాటతప్పని వాడు" చెప్పాడు పాపన్న.

ఇక రెండో రోజుకూడా వచ్చింది, రాజు గారు చెప్పిన కాలానికి ఇక కొద్ది గంటల వ్యవధి మాత్రమే ఉంది. ఇక రాడేమో అనుకుంటున్న తరుణంలో జక్కన్న పరుగు పరుగున వచ్చాడు. అతనికి చేతిమీద, మొహం మీద దెబ్బలు తగిలి ఉన్నాయి!

"అయ్యో,నీకేమైంది జక్కన్నా?" అని కన్నీళ్ళతో అడిగాడు పాపన్న.

"నేను వస్తున్నప్పుడు ఒక ఎద్దు వేగంగా వచ్చి నన్ను ఢీకొంది. ఆ దెబ్బలే ఇవి, కానీ నిన్ను రక్షించేందుకు వడి వడిగా వచ్చాను" అని అసలు విషయం చెప్పాడు.

అతను చెప్పింది విని అగ్నివర్ణుడు ఆశ్చర్యపోయాడు!. దెబ్బలు తీవ్రంగా తగిలినా అంత దూరం నుండి స్నేహితుడి కోసం వచ్చిన జక్కన్నను మెచ్చుకోకుండా ఉండలేక పోయాడు రాజు.

"జక్కన్నా, నీకు దెబ్బలు తగిలినా ఎంతో శ్రమపడి నీ స్నేహితుడిని రక్షించడం కోసం ఇంతదూరం వచ్చావు.మీ స్నేహం గొప్పది.కేవలం నా విగ్రహాన్ని విమర్శించిన దానికి అంతపెద్ద శిక్ష వేయడం నా పొరపాటు.మీ వంటి కళాకారుల్ని శిక్షిస్తే కళకే అన్యాయం చేసినట్టు అవుతుంది.అందుకే జక్కన్నకు విధించిన శిక్షను రద్దు చేస్తున్నాను,అదిగాక జక్కన్న నా శిల్పాన్ని అందంగా చెక్కాలి.పాపన్న నా తైలవర్ణ చిత్రాన్ని చిత్రీకరించాలి.మీకు తగిన సత్కారం చేస్తాను" పెద్దమనసుతో చెప్పాడురాజు.

**ఆ మాటలు విన్న అక్కడి సభికులు చప్పట్లు కొట్టారు.**

**( గ్రీకు కథ కు అను సృజన)**

**కంచనపల్లి వేంకట కృష్ణారావు**
9348611445

# సంప్రదాయ రీతిలో అంగారక సంకట హర చతుర్థి

## ఈశాన్య గణపతికి ప్రత్యేక పూజలు



**రామ కిష్టయ్య సంగన భట్ల**
**9440595494**

కృష్ణ పక్ష చతుర్థిని సంకష్ట హర చతుర్థి అంటారు. వినాయకుని ఆరాధకులు సంకట వినాయక వ్రతం అనేది అత్యంత ప్రాముఖ్యమైన వ్రతంగా భావిస్తారు. ఆ రోజు అంతా ఉపవాసం వుండి సంకట గణేష పూజ సాయంకాలం జరిపి, చంద్రదర్శనం అయినాక వారి ఉపవాసంకు ముగింపు పలికి ఏదన్నా తింటారు. సంకట చతుర్థి ప్రాముఖ్యత భవిష్య పురాణంలోనూ నరసింహ పురాణంలోనూ చెప్పబడింది. సంకట చతుర్థి మహత్యం శ్రీ కృష్ణుడు యుధిష్టరునికి వివరించాడు. సంకట అంటే కష్టములు, ఇబ్బందులు, సమస్యలను హర అంటే హరించేది అని అర్థం.

ఋగ్వేదంలో గణపతి వేదాలు, జ్ఞానములకు, కర్మిష్టులకు, సర్వవ్యాపక భక్తుల ప్రభువని సర్వగణాలకు అధిదేవతని, సర్వాహ్లాదకరుడని, సర్వులకు జ్యేష్టుడని, అధినాయకుడని, ఉత్తమ కీర్తి సంపన్నుడని కీర్తించబడ్డాడు. గణపత్యధర్వ శీర్షోపనిషత్తులో గణపతి సర్వవ్యాప్తమైన పరబ్రహ్మ స్వరూపమని సృష్టి స్థితి లయములకు కారకుడని, సర్వ కార్యములకు సృష్టికి కర్త హర్త అని ఆనందమయుడని చిన్మయుడని, లంబోదరుడని, శూర్ప కర్ణుడు రక్తం గుడిగా అభివర్ణించారు. అటువంటి గణపతి సంకటాలను దూరం చేసేవాడని సంకట హరుడుగా పూజించడం అనాదిగా వస్తున్నదే. సంకటహరుని పూజించడానికి కృష్ణ పక్ష చతుర్థి ప్రసిద్ధి. సంకట హర చతుర్థి గురించి శ్రీకృష్ణుడు, ధర్మ రాజుకు వివరించినట్లు పురాణ కథనం.

**సంకట హర చతుర్థి ప్రత్యేకత**

కృష్ణ పక్ష చతుర్థి సంకష్టహర, సంకటహర చతుర్థి అంటారు. ఈరోజు దినమంతా ఉపవాస ముండి, సాయంత్రం , నిశి పూజ, చంద్రదర్శనానంతరం భోజనాలు చేయడం, నిర్దేశిత ఆచారం. ఇలా చేస్తే సకల కష్టాలు, సంకటాలు తొలగి పోయి, సంకట నాశకుడైన విఘ్న నాయకుని కృపకు పాత్రులు, జన్మరాహిత్యం , మోక్షం సిద్ధించి, సప్త జన్మలు అవసరం లేకనే శాశ్వత గణేశ లోక ప్రాప్తి కలుగనున్నట్లు పురాణాలు వివరిస్తున్నాయి. తలపెట్టిన పనులకు విఘ్నాలు కలుగుతూ అశాంతి, మానసిక, శారీరిక రుగ్మతలు, రుణ బాధలు, అనేక కష్టాలు కలుగుతున్నప్పుడు దుష్టగ్రహ పీడన నివారణ కొరకై ప్రతి నెలా సంకష్టహర చవితి నాడు యథాశక్తి విఘ్నేశ్వరుని పూజలు జరపడం సంప్రదాయం.

సంకట హర చతుర్థి నాడు కలశ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, మహా గణపతి అధర్వ శీర్ష పూజలు, అభిషేకం, అష్టోత్తర అర్చనలు, నివేదన, హారతి, మంత్రపుష్పం, నీరాజన, తీర్థ ప్రసాద వితరణాది సాంప్రదాయక క్రతువులను నిర్వహించడం, భక్తుల గోత్రనామాదులతో ప్రత్యేక అర్చనలు, గణపతి ఉపనిషత్ యుక్త అభిషేకా దులను నిర్వహించు కోవడం, భక్తులు తమ స్వగృహాల లోనూ గణపతి పూజ లొనరించి రాత్రి చంద్ర దర్శనానంతరం అరగించడం సనాతన సంప్రదాయం. సంకష్ట చతుర్థి నాడు వినాయక వ్రతాచరణ ద్వారా కుజ దోష సమస్యలు తొలగి పోగలవని, సంకటాలన్ని తొలిగి సఫలత లభించగలదని వరం ప్రసాదించారని పురాణాలు స్పష్టం చేస్తున్నాయి.



**ఈశాన్య గణపతికి ప్రత్యేక పూజలు**

మంగళ వారం కృష్ణ పక్ష అంగారక చతుర్థి సందర్భంగా ధర్మపురి క్షేత్రంలో శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థాన అనుబంధ దేవాలయమైన శ్రీరామ లింగేశ్వర ఆలయ సంబంధిత ఈశాన్య గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి ఉపనిషత్తులతో అబిషేకం హరతి మంత్రపుష్పం కార్యక్రమంలు నిర్వహించగా, దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ , సూపరింటెండెంట్ కిరణ్ , సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ , వేదపండితులు పాలెపు ప్రవీణ్ కుమార్, స్థానిక వేదపండితులు మధు రామ శర్మ , అభిషేకం పురోహితులు బొజ్జ సంతోష్ కుమార్ , రాజగోపాల్ ,అర్చకులు విశ్వనాథ శర్మ ,సాయికుమార్ , అధిక సంఖ్యలో భక్తులు గ్రామస్థులు పాల్గొన్నారు.

# రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ

## అసలు రైతులకే భరోసా ఇవ్వాలని పలువురి అభిప్రాయం

హైదరాబాద్,జూన్25(ప్రజామంటలు): తెలంగాణలో ఈ వానాకాలం సీజన్ నుంచి ప్రారంభించనున్న రైతుభరోసా పథకంపై రైతుల అభిప్రాయాలను సేకరించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆ శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో మంగళవారం రాష్ట్రంలో 110 నియోజకవర్గాల్లోని రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా అధికారులు అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఆ నియోజకవర్గాల్లోని క్లస్టర్ల నుంచి రైతులను రైతువేదికలకు ఆహ్వానించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. చాలామంది రైతులు సన్న,చిన్నకారు రైతులకే రైతుబంధు అమలు చేయాలని, బడా రైతులకు చేయడం వల్ల తమకు నష్టం జరుగుతుందని తెలిపినట్లు సమాచారం. క్లస్టర్ల వారీగా సేకరించిన సమచారాన్ని నమోదు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న రైతుబంధు పథకం స్థానంలో 'రైతుభరోసా'ను అమలుచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 'రైతుబంధు' నిబంధనలను మార్చి కొత్త మార్గదర్శకాలతో 'భరోసా'ను అమలుపరిచేందుకు కసరత్తు చేస్తోంది. రైతులు, వివిధ వర్గాలవారి అభిప్రాయాలను తెలుసుకొని వాటికి అనుగుణంగా రైతుభరోసాపై నిర్ణయం తీసుకోవాలని ఇటీవలి మంత్రిమండలి సమావేశం తీర్మానించింది. అర్హులకు మాత్రమే ప్రజాధనం అందాలని ప్రభుత్వం భావిస్తోందని, అందుకు అనుగుణంగా ప్రభుత్వం రైతుభరోసా విధివిధానాలను ఖరారు చేయనుందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. రైతులు వ్యక్తం చేసిన అభిప్రాయాలు, సూచనలను మంత్రివర్గ ఉపసంఘానికి అందజేస్తామని వివరించారు. సంక్షేమం, అభివృద్ధి ఈ ప్రభుత్వానికి రెండు కళ్లలాంటివని, అర్హులైన పేదలకే సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. రుణమాఫీ, రైతుభరోసా అమలుపై భారాస నేతలు కాంగ్రెస్ ప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కుతున్నారని, వీటిని పారదర్శకంగా, ఆదర్శంగా అమలుచేయాలన్న ఉద్దేశంతోనే ఆలస్యమవుతుందన్న విషయాన్ని గుర్తించాలని భారాస శ్రేణులకు హితవు పలికారు.

# కెసిఆర్ ప్రోద్బలంతోనే ఎమ్మెల్యేల చేరిక

## బిజెపి నేత ఎన్‌విఎస్ ప్రభాకర్ ఆరోపణ

హైదరాబాద్,జూన్25(ప్రజామంటలు): కేసీఆర్ కనుసన్నల్లోనే ఆ పార్టీ ఎమ్మెల్యేల ఫిరాయింపు జరుగుతున్నదని బీజేపీ నాయకుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్‌లోకి వెళ్లేలా ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు.పార్టీ ఆఫీసులో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కేసీఆరే కాంగ్రెస్‌లోకి పంపిస్తున్నారని ఆరోపించారు. ఆరు నెలల్లో 11 సార్లు ఢిల్లీకి వెళ్లిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని విమర్శించారు.సీఎం ఢిల్లీలోనే క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసుకున్నారని సెటైర్ వేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు అవుతున్నా పాలనపై సీఎం రేవంత్? పట్టు సాధించలేదన్నారు. ఆరు నెలల కాలంలో మూకుమ్మడి బదిలీల పేరుతో ఐఏఎస్, ఐపీఎస్‌లను ట్రాన్స్?ఫర్ చేశారన్నారు. బదిలీలతో అధికారులు శాఖలపై పట్టు సాధించలేకపోతున్నారన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని మండిపడ్డారు. హత్యలు, లైంగికదాడులు జరుగుతుంటే సమీక్షించే నాథుడే లేరని ర్? అయ్యారు. రాష్ట్రంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం కొత్త ప్రయోగం చేస్తుందని విమర్శించారు. ఎమర్జెన్సీ విధించి 50ఏళ్లు అవుతున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ బ్లాక్ డే నిర్వహిస్తుందని ఆయన పేర్కొన్నారు.

# భవిష్యత్ బిఆర్ఎస్‌దే.. ఎవరూ తొందరపడకండి

## ఎమ్మెల్యేలతో కెసిఆర్ లంచ్ మీటింగ్

హైదరాబాద్,జూన్25(ప్రజామంటలు): మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పార్టీ మారడాన్ని పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలిపారు. భవిష్యత్ మనదేనని వారికి భరోసా ఇచ్చారు. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌తో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, కేపీ వివేకానంద గౌడ్, మాగంటి గోపీనాథ్, ముఠా గోపాల్, మాధవరం కృష్ణారావు, అరికెపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీలు శేరి సుభాశ్ రెడ్డి, దండె విఠల్, మాజీ ఎమ్మెల్యేలు జోగు రామన్న, నాయకులు క్యామ మల్లేశ్, రావుల శ్రీధర్ రెడ్డి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారితో కలిసి లంచ్ చేసిన కేసీఆర్.. బీఆర్ఎస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై చర్చించారు. ఎవరూ తొందరపడొద్దని సూచించారు. ఇలాంటి పరిణామాలు ఆనాటి వైఎస్ హయాంలోనే జరిగాయని.. అయినా మనం భయపడలేదని కేసీఆర్ గుర్తు చేశారు. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పార్టీ మారడాన్ని పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని సూచించారు. కొందరు ఎమ్మెల్యేలు పార్టీ మారినంత మాత్రాన బీఆర్ఎస్‌కు వచ్చే నష్టం ఏమీ లేదని స్పష్టం చేశారు. రేపట్నుంచి వరుసగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో భేటీలు ఉంటాయని స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రేవంత్ రెడ్డి విఫలమయ్యారని ఆరోపించారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా దెబ్బతిన్నదని అన్నారు. భవిష్యత్తులో మనకు మంచి రోజులు వస్తాయని తెలిపారు.





# యాదవ ఒగ్గు పూజారుల సంఘము నూతన కమిటీ

గొల్లపల్లి జూన్ 25 (ప్రజామంటలు): గొల్లపల్లి మండలం కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర యాదవ ఒగ్గు పూజారుల రాష్ట్ర అధ్యక్షులు కాల్వ మనోజ్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జిల్లా యాదవ ఒగ్గు పూజారుల సంఘం నూతన కమిటీ ఎకగ్రీవంగా ఎన్నుకోన్నారు. జగిత్యాల జిల్లా గౌరవ అధ్యక్షులుగా బొల్లి లచ్చయ్య యాదవ్, అధ్యక్షులుగా కొడిమ్యాల మల్లయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి బొల్లి అంజయ్య యాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాల్వ చిన్న రాజయ్య యాదవ్,సంయుక్త కార్యదర్శులు భానుక హనుమంత్ యాదవ్, కల్లూరి గంగమల్లు యాదవ్, డైరెక్టర్లుగా పెరుగు మహేష్ యాదవ్, జుర్రు రాజ్ కుమార్ యాదవ్, నక్క శివరాం యాదవ్ లను సభ్యులందరు కలిసి ఎకగ్రీవంగా ఎన్నుకోన్నారు. ఈ సందర్బంగా నూతనంగా ఎన్నికైన సభ్యులు జిల్లాలో సంఘం బలోపేతానికి ఒగ్గు పూజారుల సమస్యల పరిష్కరానికి కృషి చేస్తామని తెలియజేసారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు కావటి భూమన్న యాదవ్, మక్కపేళ్ళి రాజమల్లు యాదవ్, డేగ రమేష్ యాదవ్, అట్టేళ రాజన్న యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద స్టూడెంట్స్కు నోటు బుక్కుల పంపిణీ



సికింద్రాబాద్ జూన్ 25 (ప్రజామంటలు): బేగంపేట లోని బండిమెట్ పాటిగడ్డ లోని ప్రభుత్వ హైస్కూల్లో శ్రీరఘు సతీష్ అనే విశ్రాంత ఉపాధ్యాయుడు మంగళవారం పేద విద్యార్థులకు తన సొంత ఖర్చులతో ఉచితంగా నోటు బుక్కులను అందచేశారు. ఈసందర్బంగా నిర్వహించిన కార్యక్రమంలో బేగంపేట ఏసీపీ గోపాల కృష్ణ మాట్లాడుతూ.... రిటైర్మెంట్ అయినప్పటికీ పేద విద్యార్థులకు ఇంకా సాయం చేస్తున్న సతీష్ నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ ప్రభాకర్, విజయరాణి, స్టూడెంట్స్, పేరెంట్స్ పాల్గొన్నారు.

# ఢిల్లీలో వెంకయ్యతో ప్రధాని మోడీ భేటీ

## ఇరువురి మధ్య జాతీయ ప్రయోజనాలపై చర్చ



న్యూఢిల్లీ,జూన్25 (ప్రజామంటలు): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడుతో సమావేశమయ్యారు. మంగళవారం ఢిల్లీలోని త్యాగరాజ్ మార్గ్‌లోని వెంకయ్య నాయుడు నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వారిద్దరూ జాతీయ ప్రయోజనాలపై అభిప్రాయాలను పంచుకున్నారు. వీరిద్దరి భేటీపై మోడీ ట్వీట్ చేశారు. తాను వెంకయ్య నాయుడును కలిశానని, ఆయనతో దశాబ్దాలుగా పని చేసే అవకాశం లభించిందని వ్యాఖ్యానించారు. భారతదేశ పురోగతి పట్ల ఆయన వివేకం, అభిరుచిని ఎప్పుడూ ప్రశంసించానని అన్నారు. అలాగే మోడీ తన నివాసానికి వచ్చి కలిశారని, భారత ప్రధానిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన మోడీకి ఈ సందర్భంగా నా హృదయపూర్వక అభినందనలు తెలియజేశాని వెంకయ్యనాయుడు ట్వీట్ చేశారు. దేశ ప్రయోజనాలకు సంబంధించిన వివిధ అంశాలపై ఈ సందర్భంగా మా అభిప్రాయాలను పరస్పరం పంచుకున్నాము. నరేంద్ర మోడీ నాయకత్వంలో రాబోయే సంవత్సరాలలో భారత్ మరింత ప్రకాశిస్తుందని, సరి కొత్త శిఖరాలకు చేరుతుందని ఆశిస్తున్నాను అని అన్నారు.

# బొలెరో మాక్స్ ఆర్టీసీ బస్సు ఢీ

## డ్రైవర్ తో పాటు మరో వ్యక్తి అక్కడికక్కడే మృతి



జగిత్యాల జిల్లా ప్రతినిధి జూన్ 25 (ప్రజామంటలు): జగిత్యాల జిల్లా సరిహద్దులో గల ధర్మారం పరిధిలోగల మల్లారం కరీంనగర్ జిల్లా చొప్పదండి మధ్య రోడ్డు ప్రమాదం.కరీంనగర్ వైపు నుండి వస్తున్న బొలెరో మాక్స్ వాహనం మంచిర్యాల నుండి వస్తున్న మంచిర్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును ఢీకొట్టడంతో డ్రైవర్ తో పాటు మరో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. కాగా బొలెరో వాహనంలో అక్రమంగా జంతువుల కళేబరాలు నుండి తీసిన కొవ్వును రవాణా చేస్తున్నట్లు సమాచారం. వాటితో పాటు జంతువుల చర్మాలు భారీ స్థాయిలో ఉన్నాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. జంతువుల కళేబరాలతో తయారుచేసిన నూనెను మంచిర్యాలకు తరలిస్తున్నట్లు సమాచారం.

## మనస్థాపంతో పురుగుల మందు తాగి మహిళ మృతి




ఎల్కతుర్తి జూన్ 25 (ప్రజామంటలు): హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దండేపల్లి గ్రామానికి చెందిన కింసారపు ఓదమ్మ వయసు 55 భర్త సారయ్య ఇరుగుపొరుగు కుటుంబాలతో పందుల విషయంలో గొడవపడి ఇరుగుపొరుగు కుటుంబాల వారు దూషించగా మనస్థాపము చెంది పురుగుల మందు తాగిందని తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ తేదీ 24 తెల్లవారుజామున మృతి చెందినట్టుగా తెలిపారు విషయం తెలుసుకున్న ఎల్కతుర్తి ఎస్సై గోదారి రాజకుమార్ పోలీసు వారు మృతురాలు మరణంపై దర్యాప్తు జరిపి విచారణ చేపడతామని తెలిపారు

# రైతు రుణమాఫీ చేసిన ప్రభుత్వానికి హర్షం

## వ్యక్తం చేసిన రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఇంగే భాస్కర్



ఎల్కతుర్తి జూన్ 25 (ప్రజామంటలు): హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తి కేంద్రంలోని ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో హింగే భాస్కర్ మాట్లాడుతూ.... క్యాబినెట్ సమావేశంలో రైతులకు పంట రుణాలను రూ. 2 లక్షల రుణమాఫీ ప్రకటన చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి కి తెలంగాణ రైతు రక్షణ సమితి రైతుల తరపున ధన్యవాదాలు తెలిపారు గత కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలు మాటలకే పరిమితమై రైతులను నిలువు దోపిడీ చేసినట్లుగా వ్యవహరించ్చినారు రైతు భరోసా కూడా సాగు చేసిన రైతుకు 10 ఎకరాల వరకు పరిమితి విధించి రైతు భరోసా కల్పించాలని రైతులు సాగు పనులు కొనసాగుతున్నాయి. కావున వీలైనంత త్వరగా పెట్టుబడి సహాయం రైతుబంధు రైతుల ఖాతాలో జమ చేయాలని భాస్కర్ కోరారు చనిపోయినటువంటి రైతులు యొక్క నామిని ఖాతాలో రైతు భరోసా డబ్బులు పడలేదని పలు కారణాలతో రైతు కుటుంబాలు అగ్రికల్చర్ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. వీలైనంత త్వరగా రైతుబంధు రైతు బీమా సమస్యలను పరిష్కరించి రైతులను ఆదుకోవాలని తెలిపారు.

# విటిలిగో ఒక చర్మవ్యాధి, అంటు వ్యాధి కాదు

## గాంధీలో వరల్డ్ విటిలిగో డే




సికింద్రాబాద్ జూన్ 25 (ప్రజామంటలు): ప్రపంచ విటిలిగో దినోత్సవం సందర్భంగా మంగళవారం గాంధీ ఆసుపత్రిలోని డీవీఎల్ విభాగంలో అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా డీవీఎల్ హెచ్ఓడి ప్రొఫెసర్ సుధా రాణి మాట్లాడుతూ.... విటిలిగో అనేది ఒక చర్మ సంబంధిత వ్యాధి అని, చర్మం తన సహజ రంగును కొల్పోయి, తెల్లటి మచ్చలు ఏర్పడుతాయన్నారు. ఇది అంటు వ్యాధి కాదని, ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందదన్నారు. మెలనిన్ ఉత్పత్తి తగ్గడం వలన ఈ వ్యాధి సంక్రమిస్తుందన్నారు. గాంధీ ఆసుపత్రిలో విటిలిగో కు ట్రీట్మెంట్ అందుబాటులో ఉందని ఆమె పేర్కొన్నారు. ప్రతి శుక్రవారం విటిలిగో పేషంట్లకు స్పెషల్ క్లినిక్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డా. రఘుకిరన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ప్రవీన్, డా. శంకర్, డా. సత్తయ్య, డా. సౌమ్య, డా. శాంభవి, సిబ్బంది పాల్గొన్నారు.

# కేశోరామ్ ఎన్నికల్లో బిఆర్ఎస్ ప్యానల్ విజయం

## కెసిఆర్, కెటిఆర్‌లను కలిసిన కౌశిక్ హరి

హైదరాబాద్,జూన్25(ప్రజామంటలు): రామగుండం కేశోరాం సిమెంట్స్ ఫ్యాక్టరీ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్యానల్ విజయం సాధించింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ప్యానల్ అధ్యక్షులు కౌశిక్ హరి కుటుంబ సభ్యులు పార్టీ అధినేత కేసీఆర్‌ను కలిశారు. సిరిసిల్ల, సిద్దిపేట ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావును కూడా కౌశిక్ హరి కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్‌తో పాటు హరీశ్‌రావు, కేటీఆర్ కౌశిక్ హరికి శుభాకాంక్షలు తెలిపారు. బసంత్ నగర్‌లోని కేశోరాం సిమెంట్స్ ఫ్యాక్టరీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకుడు కౌశిక్ హరితో పాటు ఆయన ప్యానల్ ఘనవిజయం సాధించింది. మొత్తం 788 ఓట్లు పోలవగా కౌశిక్ హరి ప్యానల్‌కు 418, బయ్యపు మనోహర్ రెడ్డి ప్యానెల్‌కు 351, దేవీ లక్ష్మీనరసయ్య ప్యానల్‌కు 1, నరేష్‌కు 9 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 7 ఓట్లు చెల్లలేదు. కౌశిక్ హరి ప్యానల్ గెలుపుతో బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు అంబరాన్నంటాయి. పటాకులు కాల్చి స్వీట్లు పంచి పెట్టి సెలబ్రేషన్స్ జరుపుకున్నారు.

# పాత కక్షలు నేపథ్యంలో హత్య

## ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు

## ఒక్కొక్కరికి 5000 రూపాయల జరిమాన

జగిత్యాల జూన్ 25 (ప్రజామంటలు): మెట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వేంపేట గ్రామానికి చెందిన ధనరేకుల రాజేందర్ వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన జెల్ల రమేష్ మరియు అతని తమ్ముడు జెల్ల మహేష్ లకు రాజేందర్ కు మధ్యలో పాత కక్షలు ఉన్నవి. విటిని మనుసులో పెట్టుకొని రాజేందర్ ను కత్తితో పొడిచి హత్యాయత్నం చేయగా వీరిపై మెట్పల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి జైలుకు పంపించడం జరిగింది. రమేష్ మరియు మహేష్ లు జైలు ను%శీ%డి బెయిల్ పై బయటకు వచ్చిన తర్వాత పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడుకుని పరిష్కరించుకుందామని ప్రయత్నం చేయగా దీనికి ధనరేకుల రాజేందర్ నిరాకరించడం జరిగింది. కేసు విత్ డ్రా విషయంలో ధనరేకుల రాజేందర్ ఎంతకీ వినకపోవడం సరికి రమేష్ మరియు మహేష్ లు రాజేందర్ ను ఎలాగైనా చంపాలని ఉద్దేశంతో తేది 19-05-2020 రోజున ఒంటరిగా ఉన్న రాజేందర్ ను గమనించిన రమేష్ మరియు మహేష్ లో తమ వెంట తెచ్చుకున్న కత్తితో రాజేందర్ మెడ పై, రెండు చేతులపై, మోకాళ్లపై విచక్షణారహితంగా పొడవుగా తీవ్ర గాయాలైన రాజేందర్ అక్కడికక్కడే మరణించడం జరిగింది. మృతుని భార్య దనరేకుల హరిణి ఫిర్యాదు మేరకు మెట్ పల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయడం జరిగినది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు నిదితులు అయన జెల్ల రమేష్, మహేష్ లను కోర్టులో హాజరు పరచడం జరిగింది. కేస్ ను విచారించిన న్యాయమూర్తి నీలిమ జిల్లా జడ్జి నిదితులకు జీవిత ఖైదు పాటు ఒక్కొక్కరికి 5,000 రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ కేస్ లో పీపీ గా మల్లికార్జున్, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్స్ గా ఇన్స్పెక్టర్ రవికుమార్ , ఎస్.ఐ. సదాకర్ సిఎంఎస్ఎస్ ఐజి. రాజునాయక్, కానిస్టేబుల్ కిరణ్ కుమార్ మరియు కోర్టు కానిస్టేబుల్ రంజిత్ నిందితులకు శిక్ష పడడంలో కోర్టుకు సాక్షాధారాలు అందించడంలో ప్రముఖ పాత్ర వహించడం జరిగింది. పై కేస్ లో నిందితులకు శిక్ష పడటంలో కృషి చేసిన పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపిఎస్ అభినందించారు.

## శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రవణా నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్నప్రసాద వితరణ




కొడిమ్యాల జూన్ 25 (ప్రజామంటలు): కొడిమ్యాల శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఈ సంవత్సరం 7వ సారి స్వామి వారి జన్మనక్షత్రం శ్రవణ నక్షత్రంని పురస్కరించకుని ఉదయం స్వామి వారికి సహస్ర పుష్పాభిషేకం నిర్వహించి భక్తులకు అన్నప్రసాద వితరణ చేయడం జరిగింది. ఈరోజు అన్న ప్రసాద దాత హైదారాబాద్ వాస్తవ్యులు పెద్ది సతీష్ గుప్త-శ్రావణి (తండ్రి: కొండూరి రవీందర్) కుతూరు: వీక్ష, కూమారుడు: నన్మయ్, తల్లిదండ్రులు: ప్రేమలీల (కీ.శే. సాంబయ్య గుప్త) కూతురు దీక్ష పుట్టినరోజు సందర్భంగా ఇట్టి అన్న ప్రసాదం భక్తులకు వితరణ చేయడం జరిగింది. ఇట్టి పూజ కార్యక్రమాలు ఆలయ నిర్మాణ కమిటి, అర్చకులు నాగరాజు రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో దాతలు, భక్తులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జాబ్ మేళాకు విశేషమైన స్పందన

### నిరుద్యోగ యువతీ యువకుల్లో ఆనందోత్సవాలు - జెడ్పి ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్



చిగురు మామిడి జూన్ 25 (ప్రజామంటలు): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ నిర్వహించినమెగా జాబ్ మేళాను విజయవంతంగా నిర్వహించడం పట్ల నిరుద్యోగ యువతీ యువకుల నుండి సర్వత్రా హర్షం వెల్లువవుతుంది. ఈ సందర్భంగా చిగురుమామిడి మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన పత్రికా సమావేశంలో జెడ్పి ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్ మాట్లాడుతూ నిరుద్యోగులు అధికంగా ఉన్న హుస్నాబాద్ మెట్ట ప్రాంతంలో మంత్రి ప్రత్యేక చొరవ చూపి జాబ్ మేళాను నిర్వహించడం సంతోషకరమన్నారు. ఇట్టి జాబ్ మేళా విశేష స్పందనతో పాటు విజయవంతం కావడం సంతోషకరమన్నారు. జాబ్ మేళాలో 8795 మంది నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొనగా, వారిలో 1310 మందిని తక్షణమే ఎంపిక చేసి అప్పాయింట్మెంట్ ఆర్డర్లు ఇవ్వగా, 3887 మందికి నైపుణ్యత శిక్షణ అనంతరం ఉద్యోగాలిస్తారని, మొత్తం 5 200 మందికీ ఉద్యోగ అవకాశాలు కల్పించడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమ న్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ గతములో ఎన్నడూ లేని విధంగా ఈ ప్రాంత ప్రజల ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగు పరుచుటకు మెగా జాబ్ మేళాను నిర్వహించడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఉద్యోగ నియామకాలు చేసిన వివిధ కంపెనీల యజమాన్యాలకు మరియు భోజన వసతితో పాటు సౌకర్యాలు కల్పించిన యువజన శాఖ అధికారు లకు కృత్ఙతలు తెలిపారు. ఈ పత్రికా సమావేశములో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిటుమల్ల రవీందర్, బుర్ర శ్రీనివాస్, యువజన మండల శాఖ ఉపాధ్యక్షులు గట్టు ప్రశాంత్, దూలమిట్ట నర్సింహారెడ్డి, గందె రమేష్, సోషల్ మీడియా పట్టణ ఇంచార్జ్ సుంకరపెల్లి ఆంజనేయులు పీచు రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డయల్ 100 కాల్స్ కు తక్షణమే స్పందించి, వెంటనే సంఘటనా స్థలానికి చేరుకోవాలి

### సైబర్ మోసాల పై ప్రజలకు అవగాహన కల్పించాలి

### జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ అశోక్ కుమార్



జగిత్యాల జూన్ 25 (ప్రజామంటలు): జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ జగిత్యాల పట్టణ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ లో ఎంత మంది సిబ్బంది ఉన్నారు. వారు ఏ ఏ విధులు నిర్వహిస్తున్నారో పరిశీలించారు. పోలీస్ స్టేషన్ నుండి రోజు ఎన్ని బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ విధులు నిర్వహిస్తున్నాయని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడెక్కడ ఎన్ని బిట్స్ నడుస్తున్నాయని తెలుసుకొని ప్రాపర్ గా పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని, బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్ నిరంతరం 24%శ%7 గస్తీ నిర్వహించాలని సూచించారు. ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సూచించారు. జగిత్యాల పట్టణ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది అందరి కృషి చేయాలని సిబ్బంది, అధికారులు అందరూ విధులు సక్రమంగా నిర్వహించడం ద్వారానే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని సూచించారు. టౌన్ పరిసరాలు ఎలాంటి సంఘటనలు జరిగినా పై అధికారులకు తక్షణమే తెలియజేయాలని సూచించారు. పట్టణ పరిధిలో ట్రాఫిక్ కు ఎలాంటి అంతరాయం జరగకుండా చూసుకోవాలని సూచించారు. ప్రస్తుత రోజుల్లో మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి కావున ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ మరియు టౌన్ సిబ్బంది అందరూ డ్రంక్ అండ్ డ్రైవ్ చేసే వారిపై పై ఎక్కువ దృష్టి సారించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు. డిఎస్పి రఘు చందర్ , టౌన్ ఇన్స్పెక్టర్ వేణు గోపాల్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆల్ఫా హొటల్ పై తప్పుడు ప్రచారం తగదు

### తప్పుడు ఆరోపణలను ఖండించిన యాజమాన్యం




సికింద్రాబాద్ జూన్ 25 (ప్రజామంటలు): దశాబ్దాల తరబడిగా సిటీలోనే కాకుండా దూరప్రాంతాలకు చెందిన వినియోగదారుల విశ్వాసాన్ని చూరగొన్న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని ఆల్ఫా హొటల్ పై కొంత మంది అసత్య ప్రచారం చేయడాన్ని హొటల్ యాజమాన్యం తీవ్రంగా ఖండించింది. ఇటీవల ఫుడ్ సేఫ్టీ అధికారులు హొటల్ ను సందర్శించి తనిఖీలు చేశారని, కాని వారు చెప్పిన వాటికి, కొన్ని మీడియా లో వచ్చిన వార్త కథనాలకు పొంతన లేదన్నారు. బేకరీ ఆహార వస్తువులపై మూతలు పెట్టాలని, ఆల్ఫా హొటల్ లో తయారవుతున్న బేకరీ ఫుడ్స్ పై లేబుల్స్ , డేట్ ను ముద్రించాలని మాత్రమే ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు తమకు సూచించారని మేనేజర్ తెలిపారు. అధికారులు సూచించిన సమాచారాన్ని ట్విట్టర్ లో పెట్టారని, దానిని ఆసరాగా చేసుకొన్న కొన్ని పత్రికలు తమ ఇష్టం వచ్చినట్లుగా అన్వయించుకొని ఆల్ఫా యాజమాన్యంపై కథనాలు రాశారని వాపోయారు. నాణ్యత లేని ఆహారాన్ని అందిస్తున్నట్లుగా కుళ్ళిపోయిన మాంసాహారాలను నిల్వ ఉన్నట్లుగా వాళ్ళ కథనాలు మీడియాలో పత్రికలలో వచ్చాయని చెప్పారు. ట్విన్ సిటీస్ లో గత 80 ఏండ్లుగా మంచి పేరు, చరిత్ర కలిగిన తమ ఆల్ఫా హొటల్ పై తప్పుడు కథనాలు, ఆరోపణలు, నిందలు వేయవద్దని ఆయన కోరారు. ఏదేని సమస్యలు ఉంటే తమ దృష్టికి నేరుగా తేవచ్చని సూచించారు.

## ఇందిర గాంధీ ఏకపక్ష నిర్ణయం ప్రజాస్వామ్యానికి చీకటి రోజుకు నేటితో 50 ఏళ్లు




జగిత్యాల జూన్ 25 (ప్రజామంటలు): ఎమర్జెన్సీ వ్యతిరేక దినోత్సవ సందర్భంగా స్థానిక జగిత్యాల పట్టణంలోని జగిత్యాల నియోజకవర్గం కార్యాలయం "కమల నిలయంలో" ఎమర్జెన్సీ వ్యతిరేక దినోత్సవ మీటింగ్ నిర్వహించి అనంతరం నిరసన తెలియజేసిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల నియోజకవర్గ ఇన్చార్జ్ డా. బోగ శ్రావణి. ఈ సందర్భంగా డాక్టర్ బోగ శ్రావణి మాట్లాడుతూ.... 1975 జూన్ 25న నాటి ప్రధాని ఇందిరా గాంధీ ఏకపక్షంగా వ్యవహరించి దేశవ్యాప్తంగా అత్యవసర పరిస్థితిని విధించారు. ప్రజల కనీస హక్కులను కాలరాస్తూ 21 నెలల పాటు అప్రకటిత నియంతృత్వం రాజ్యమేలి, 1977 మార్చి ఎన్నికలలో ఇందిర ఘోర పరాజయంతో ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరిగింది. అందుకే జూన్ 25ను భారత ప్రజాస్వామ్యానికి చీకటి రోజుగా అభివర్ణించారు. అంతర్గత అలజడి పేరుతో ఎమర్జెన్సీ విధించిన నాటి ప్రధాని ఇందిరా గాంధీ తన రాజకీయ ప్రత్యర్థులను జైలుకు పంపారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో అత్యంత వివాదస్పదమైన నిర్ణయాల్లో ఈ అత్యవసర పరిస్థితి ఒకటి ఇందిర సిఫార్సుతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 352 (1)లోని అంతర్గత అత్యవసర పరిస్థితి నిబంధన వినియోగించుకుని నాటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ 1975 జూన్ 25 అర్ధరాత్రి 11.45 నిమిషాలకు ఎమర్జెన్సీ విధిస్తున్నట్టు ప్రకటించారు. అత్యయిక స్థితి విధించిన వెంటనే ప్రతిపక్ష నేతలను అరెస్ట్ చేయడం, ఎన్నికల వాయిదా, ప్రభుత్వ వ్యతిరేకతను అణచివేయడం, పత్రికలపై నియంత్రించడం లాంటి చర్యలను చేపట్టారు. ఇది 1977 మార్చి 21 వరకు 21 నెలలపాటు కొనసాగింది. ఆదేశాల ద్వారా పరిపాలిస్తూ ఎన్నికలను నిలిపివేసి, పౌరహక్కులు అడ్డుకునే అధికారాన్ని అత్యవసర పరిస్థితి ప్రధాన మంత్రికి అందించింది. ఈ సందర్భంగా ఈరోజు భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు ఎక్కడికక్కడ భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు అందరూ నిరసన తెలియజేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో జగిత్యాల పట్టణ అధ్యక్షులు రంగు గోపాల్, జిల్లా కార్యాలయ కార్యదర్శి జుంబర్తి దివాకర్, జగిత్యాల రూరల్ మండలం అధ్యక్షులు నలువాల తిరుపతి, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముదరాజు, పట్టణ ఉపాధ్యక్షులు పవన్ సింగ్,గదాసు రాజేందర్, మ్యాకల లక్ష్మి, మల్లీశ్వరి, గడ్డల లక్ష్మి, భానుప్రియ, మధురిమ, కవిత, లావణ్య, మంజుల, మామిడాల రాజగోపాల్, కుక్కల శ్రీకాంత్, చిట్యాల రాము మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఆధైర్యపడొద్దు కార్యకర్తలకు అండగా బిఆర్ఎస్ పార్టీ

### భీమా చెక్కు అందజేసిన మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్



చిగురుమామిడి జూన్ 25 (ప్రజమంటలు): కార్యకర్తలు ఎవరూ ఆధైర్యపడొద్దని, కార్యకర్తలకు అండగా బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ఉంటుందని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ అన్నారు. హుస్నాబాద్ లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త బొయిని వెంకటయ్య ప్రమాదవశాత్తూ మృతి చెందగా బిఆర్ఎస్ పార్టీ పార్టీ సభ్యత్వ ప్రమాద బీమా ద్వారా మంజూరైన 2 లక్షల విలువైన చెక్కును నామినీగా ఉన్న కుమారుడు చిగురుమామిడి మండల బిఆర్ఎస్ వి మండలం అధ్యక్షులు బోయిని మనోజ్ కు చెక్కును మాజీ శాసన సభ్యులు వొడితల సతీష్ కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య, మాజీ మండల అధ్యక్షుడు రామోజు కృష్ణమాచారి, పెనుకుల తిరుపతి, నవాబుపేట గ్రామ శాఖ అధ్యక్షుడు పిల్లి వేణు, శరభందన్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు అభిమానులు ఉన్నారు.

## గాంధీ లో గుర్తు తెలియని డెడ్ బాడీ



సికింద్రాబాద్ జూన్ 25 (ప్రజామంటలు): గాంధీ ఆసుపత్రి ఆవరణలో మరో గుర్తు తెలియని డెడ్ బాడీ వెలుగు చూసింది. చిలకలగూడ ఎస్.ఐ. పి.కిషోర్ కథనం ప్రకారం....గాంధీ ఆసుపత్రి వెయిటింగ్ హాల్ లో పడి ఉన్న 50 నుండి 55 ఏళ్ల గుర్తు తెలియని డెడ్ బాడీని చూసిన ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. డెడ్ బాడీ వద్ద ఎలాంటి వివరాలు లభించక పోవడంతో పోలీసులు డెడ్ బాడీని మార్చురికి తరలించి భద్రపరిచారు. మృతుడిని గుర్తుపట్టిన వారు చిలకలగూడ ఠాణా లో సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కిషోర్ కోరారు.

## బుగ్గారం వాసికి డాక్టరేట్

### విద్యా-ఆధ్యాత్మిక కళా తపస్వి "నక్క రాజు" ను వరించిన డాక్టరేట్





బుగ్గారం జూన్ 25 (ప్రజామంటలు): జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రానికి చెందిన ప్రముఖ విద్యావేత్త, ఉద్యమ కలాకారుడు, ఆధ్యాత్మిక చింతనాపరుడు నక్క రాజు డాక్టరేట్ అవార్డ్ కు ఎంపికయ్యారు. ఆసియా ఇంటర్ నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు నక్క రాజు డాక్టరేట్ అవార్డ్ కు ఎంపికైనట్లు జారీ చేసిన ఉత్తర్వుల ప్రతి మంగళ వారం ఆయనకు అందింది. గత 18 సంవత్సరాల నుండి అటు విద్యారంగంలో కొనసాగుతూ శ్రీ గ్లోబల్ హైస్కూల్ ను బుగ్గారంలో స్థాపించి, ఇటు కళా రంగంలో ప్రాణదాత (జనని) వేదిక ద్వారా గత 12 సంవత్సరలుగా ప్రతిఏటా మహాశివరాత్రిని పురస్కరించుకొని ఆరుసార్లు 24 గంటల నిర్విరామ గాన స్వరాభిషేకం నిర్వహిస్తూ వస్తున్నారు. ఎంతోమంది యువతీ యువకులకు స్ఫూర్తిదాయకంగా విద్యా- ఆధ్యాత్మిక, భక్తి రంగాల్లో నక్క రాజు చేస్తున్న ఎనలేని సేవలను గుర్తించి ఆసియా ఇంటర్నేషనల్ సాంస్కృతిక పరిశోధన విశ్వవిద్యాలయం డాక్టరేట్ అవార్డు కు ఎంపిక చేశారు. ఈ ఎంపికలో యూనివర్సిటీ కో - ఆర్డినేటర్, స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా ఎన్జీవో చైర్మన్ లయన్ డాక్టర్ ఆకుల రమేష్, తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్ లు ప్రోద్భలం అందించారు. జూలై 13న హైదరాబాద్ లోని సరస్వతి పరిషత్ ఆడిటోరియంలో నిర్వహించనున్న అవార్డుల ప్రధానోత్సవంలో అతిరథ మహారధుల మధ్య ఈ అవార్డు అందించనున్నట్లు సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. అనేక మంది ప్రముఖులు, ప్రజలు, భక్తులు నాతో అన్ని రంగాలలో సహకరించడం వల్లనే నాకొక గుర్తింపు, ఈ డాక్టరేట్ అవార్డు లభించిందని అవార్డ్ గ్రహీత, గ్లోబల్ హైస్కూల్ కరస్పాండెంట్ నక్కరాజు తెలియజేశారు. వారందరికీ, ఈ అవార్డ్ సెలెక్షన్ కు ప్రోత్సాహాన్ని అందించిన స్ఫూర్తి ప్రదాతలకు ఈ సందర్భంగా నక్క రాజు కృతజ్ఞతలు తెలియజేశారు.

## గాంధీలో విధులను బహిష్కరించిన జూడాలు



సికింద్రాబాద్ జూన్ 25 (ప్రజామంటలు): గాంధీ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్లు రెండో రోజు మంగళవారం తమ డ్యూటీలను బహిష్కరించి, గాంధీ మెయిన్ బిల్డింగ్ ఎదుట బైఠాయించి, ఆందోళన నిర్వహించారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు. ఆసుపత్రిలో తాము అన్ని రకాల ఎలక్టివ్ సర్జరీలు, ఓపీ సేవలు, వార్డు డ్యూటీ లను బహిష్కరించినట్లు గాంధీ జూడా యూనిట్ ప్రెసిడెంట్ డా. ఎం. వంశీకృష్ణ తెలిపారు. ఇక ఐసీయూ, ఎమర్జెన్సీ సర్వీసుల్లో మాత్రం పాల్గొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తీర్చేంతవరకు తమ సమ్మె ఆగబోదన్నారు.

## ఎంపీ గా ప్రమాణ స్వీకారం చేసిన ఈటల రాజేందర్

### బీజేపీ శ్రేణుల నుంచి అభినందనల వెల్లువ



సికింద్రాబాద్ జూన్ 25 ( ప్రజామంటలు): మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడిగా భారీ మెజార్టీతో గెలుపొందిన బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ మంగళవారం పార్లమెంట్ లో ఎంపీగా ప్రమాణస్వీకారం చేశారు. ఈసందర్భంగా సిటీనుంచి న్యూ ఢిల్లీకి వెళ్ళిన బీజేపీ శ్రేణులు ఎంపీ ఈటల రాజేందర్ ను కలసి ఆత్మీయ శు భాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ కు చెందిన అఖిల భారత ముదిరాజ్ సంఘం ప్రెసిడెంట్ పొట్లకాయల వెంకటేశ్వర్లు తన అనుచరులతో కలసి ఢిల్లీకి వెళ్ళి ఎంపీ ఈటల రాజేందర్ ను కలిశారు. పూల బొకేను ఇచ్చి గ్రీటింగ్స్ చెప్పారు. ప్రజల అభిమానంతో ముదిరాజ్ ల నాయకులు, ఎంపీ ఈటల రాజేందర్ భవిష్యత్ లో మరిన్ని ఉన్నత పదవులు అధిష్టించాలని ఆకాంక్షించారు.

# ఎమ్మెల్యే సంజయ్ చేరికతో పార్టీలో చిచ్చు

## రాజీనామా చేస్తా..పల్లెల్లో తిరుగుతా

## కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తిరుబావుటా

## బుజ్జిగింపులతో దిగిరాని కాంగ్రెస్ సీనియర్ నేత

## హైదరాబాద్ వచ్చాక మాట్లాడుతా.. దాపాదాస్ మున్షీ ఫోన్..



జగిత్యాల,జూన్25 (ప్రజా మంటలు): కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వంపై ఇప్పటికే అసహనంతో ఉన్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి పల్లెలన్నీ తిరుగుతానని వెల్లడించారు. ప్రజల అభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. అయితే పార్టీ మారే ఆలోచన ఇప్పటివరకు అయితే లేదని పేర్కొన్నారు. అలాగే ఏ పార్టీ నుంచి కూడా ఆహ్వానం లేదన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వచ్చి మాట్లాడారని జీవన్ రెడ్డి తెలిపారు. తనతో కాంగ్రెస్ ఇన్‌ఛార్జి దీపదాస్ మున్షీ కూడా మాట్లాడారని పేర్కొన్నారు. బీజేపీ నుంచి ఎవరూ తనను సంప్రదించలేదని స్పష్టం చేశారు. ఏ పార్టీ నుంచి తనకు కాల్స్ రాలేదని తెలిపారు. ఈ స్టేజ్‌లో పార్టీ నుంచి గౌరవం కోరుకున్నా.. కానీ ఈ రోజు తనకు ఆ గౌరవం దక్కలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్నేళ్లు పార్టీ ప్రతి నిర్ణయాన్ని పాటించానని తెలిపారు . నష్టం కలిగినా పార్టీ ఎక్కడ పోటీ చేయాలన్నా చేశానని పేర్కొన్నారు. తన ప్రమేయం లేకుండానే జరగాల్సింది జరిగిందని చెప్పారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని సోమవారం శ్రీధర్ బాబు కలిసి బుజ్జగించే ప్రయత్నం చేశారు. కానీ ఆయన లొంగలేదు. '200 కోట్ల రూపాయల నిధులు ఇచ్చి కండువా కప్పడం అవసరమా? ఇప్పుడు ప్రభుత్వానికి ఏమైంది? నా సీనియారీటి, సిన్సియార్టీకి ఇచ్చే విలువ ఇదేనా? కార్యకర్తల కష్టాలు, మనోభావాలు అక్కర్లేదా?' అంటూ మంత్రి శ్రీధర్‌బాబు ఎదుట ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను పార్టీలో చేర్చుకోవడంపై కినుక వహించిన జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం తన ఇంటికి వచ్చిన మంత్రి శ్రీధర్‌బాబుపై జీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు రెండుసార్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడండి అంటూ జీవన్‌రెడ్డిని కోరినా, 'మాట్లాడను' అంటూ తిరస్కరించినట్టు సమాచారం. మరోవైపు కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి దీపాదాస్ మున్షీ ఫోన్ చేశారు. రాజీనామా నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఈ సందర్భంగా కోరినట్లు సమాచారం. హైదరాబాద్ వచ్చాక అన్ని విషయాలు మాట్లాడుతామని మున్షీ చెప్పినట్లు సమాచారం. మరోవైపు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఇంటికి చేరుకున్నారు. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తారని వార్తలు వస్తున్న నేపథ్యంలో మరోసారి జీవన్ రెడ్డితో ఆయన మాట్లాడారు. రాజీనామా ఆలోచనను విరమించుకోవాలని జీవన్ రెడ్డిని లక్ష్మణ్ కోరారు. నాలుగు దశాబ్దాలుగా క్రియాశీల రాజకీయాల్లో ఉన్న తనను మాటమాత్రంగానైనా సంప్రదించకుండా తన సొంత నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేను పార్టీలో చేర్చుకోవడాన్ని ఆయన ఆక్షేపించారు. ఇది తనను అగౌరవపరిచినట్లేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. జగిత్యాల కాంగ్రెస్ నాయకులే కాకుండా ఇతర జిల్లాలకు చెందిన వందలాది కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధులు సైతం సోమవారం ఉదయమే జీవన్‌రెడ్డి నివాసానికి చేరుకున్నారు. రాత్రి వరకూ అక్కడే ఉండి జీవన్‌రెడ్డి ఆవేదనలో పాలుపంచుకున్నారు. ఈ క్రమంలోనే ఒకరిద్దరు సీనియర్ నేతలు పార్టీకి రాజీనామా చేస్తూ టీపీసీసీ అధ్యక్షుడికి లేఖలు పంపించినట్లు ప్రకటించారు. దీంతో పార్టీ రాష్ట్ర నాయకత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టి జీవన్‌రెడ్డిని సముదాయించడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. సోమవారం మధ్యాహ్నం ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మన్‌కుమార్, మరో ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ జీవన్‌రెడ్డిని కలిసి ఆయనకు నచ్చజెపుతూ తొందరపాటు నిర్ణయం ఏదీ తీసుకోవద్దని కోరినట్లు తెలిసింది. పరిస్థితి తీవ్రతను గుర్తించిన పార్టీ అధినాయకత్వం మంత్రి శ్రీధర్‌బాబును దూతగా పంపగా ఆయన చర్చలు జరిపారు. జీవన్‌రెడ్డి మనోభావాలను పరిగణనలోకి తీసుకుంటామని, ఆయనకు ఏ మాత్రం ప్రాధాన్యం తగ్గకుండా పార్టీ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గతంలో మాదిరిగానే ఆయన పార్టీకి పెద్ద దిక్కుగా ఉండాలని కోరుకుంటున్నామన్నారు. ఈ సంఘటన కారణంగా మనస్తాపానికి గురైనట్లు జీవన్‌రెడ్డి వివరించారని, అన్ని విషయాలను అధిష్ఠానానికి తెలియజేస్తానని తెలిపారు. అనంతరం జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ జరిగిన పరిణామాలపై శ్రీధర్‌బాబుతో చర్చించానన్నారు. కాంగ్రెస్ అభ్యున్నతి కోసం కృషి చేసిన కార్యకర్తల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. కార్యకర్తల మనోభావాలను గౌరవించాల్సిన బాధ్యత పార్టీపై ఉందని అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానన్నారు. పార్టీ నిబంధనల్ని పాటిస్తానని, అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి పోటీ చేసిన జీవన్‌రెడ్డి పరాజయం పాలయ్యారు. ఆయన్ను గెలిస్తే నిజామాబాద్ జిల్లా రాజకీయాల్లోనూ జోక్యం చేసుకుంటారన్న ఉద్దేశంతో అక్కడి నాయకులు ఆయనకు సహకరించలేదన్న ప్రచారం జరుగుతోంది. నిజామాబాద్ నుంచి మంత్రి పదవి ఆశిస్తున్న నాయకుడికి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో సాన్నిహిత్యం ఉంది.

# విద్యుత్ బకాయిలే సమస్య

## గుదిబండగా అక్రమ కనెక్షన్లు

వరంగల్,జూన్25 (ప్రజా మంటలు): పేరురుపోతున్న విద్యుత్ బకాయల కారణంగా సంస్థకు నష్టాలు తప్పడం లేదు. ప్రస్తుతం వరంగల్ రూరల్, అర్బన్‌గా రెండు డివిజన్లుగా విభజించి సేవలు అందిస్తున్నారు. ఈ రెండు డివిజన్‌లలోనే సుమారు నాలుగు లక్షలకుపైగా విద్యుత్తు సర్వీసులు ఉన్నాయి. అత్యధిక ఆదాయం కూడా ఈ రెండు డివిజన్ల నుంచే వస్తుంది. విద్యుత్ ఉద్యోగుల సంఖ్య పెరిగినా ఆదాయ వనరులు పెద్దగా పెరిగిన దాఖలాలు లేకపోవడంతో కంపెనీ పీకల్లోతు నష్టాలతో కాలం నెట్టుకొస్తుంది. పదోన్నతులు కల్పించకుండా ప్రస్తుతమున్న ఇంజినీర్లతోనే కొత్త జిల్లాల్లో సర్దుబాటు చేస్తున్నారు. పని లేని విభాగాలకు సంబంధించిన పోస్టులను రద్దు చేసి సర్దుబాటు చేశారు. పేరుకుపోయిన బకాయిలు వసూలయితేనే సంస్థ మనుగడ సాధ్యమని కొందరు అధికారులు అన్నారు. ఇదిలావుంటే గ్రేటర్ పరిధిలో సుమారు పదివేల వరకు అక్రమ నల్లా కనెక్షన్లు ఉన్నట్లు ఇంజినీరింగ్ అధికారులు భావిస్తున్నారు. గత మూడు నెలల కింద డివిజన్ల వారీగా చేసిన సర్వే ఆధారంగా అధికారులకు సుమారు ఆరువేల అక్రమ నల్లా కనెక్షన్లు ఉన్నట్లు తేలింది. దీనికి అదనంగా మరో నాలుగు వేల వరకు అక్రమ కనెక్షన్లు ఉంటాయని అంచనాకు వచ్చారు. రెసిడెన్షియల్ నల్లా కనెక్షన్లతో పాటు కమర్షియల్ కనెక్షన్లు కూడా పెద్ద ఎత్తున ఉన్నట్లు వారు గుర్తించారు. పెద్దమొత్తంలో బల్దియా ఆదాయానికి అక్రమ నల్లాలతో గండి పడుతోందని భావిస్తున్న అధికారులు వాటిని క్రమబద్ధీకరించే పక్రియకు శ్రీకారం చుడుతున్నారు. క్షేత్రస్థాయిలో అక్రమ నల్లాల తొలగింపు పక్రియను చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. పెద్ద సంఖ్యలో ఉన్న అక్రమ నల్లా కనెక్షన్లను క్రమబద్ధీకరిస్తే కార్పొరేషన్‌కు పెద్దమొత్తంలో ఆదాయం వస్తుందని వారు భావిస్తున్నారు.

# రైతు సంక్షేమం లక్ష్యంగా కెసిఆర్ రైతుబంధు

## బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్



హైదరాబాద్,జూన్25(ప్రజా మంటలు): రైతు సంక్షేమమే ధ్యేయంగా కేసీఆర్ విప్లవాత్మక పథకాలు అమలు చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. దేశంలోనే తొలిసారి కేసీఆర్ హయాంలో రైతు బంధు అమలు చేశామన్నారు. ఫార్మర్ ఫస్ట్ అనేది కేవలం నినాదం కాదని, దీనికి కొన్ని విప్లవాత్మక విధానాలు మద్దతుగా నిలిచాయని చెప్పారు. అది కేసీఆర్ ప్రభుత్వం సాధించిన గొప్ప విజయం అని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వంలో రైతు మరణాలు తగ్గడంపై అరవింద్ వారియర్ అనే నెటిజన్ చేసిన ట్వీట్‌కు కేటీఆర్ స్పందించారు. తాము తీసుకొచ్చిన పథకాల గురించి వెల్లడించారు. 70 లక్షల మంది రైతులకు రూ.73 వేల కోట్లు ఖాతాల్లో వేశామన్నారు. ప్రతి రైతుకు రైతు బీమా పేరుతో రూ.5 లక్షల జీవిత బీమా కల్పించామని తెలిపారు. రూ.25 వేల కోట్లతో రుణమాఫీ అమలు చేశామని వెల్లడించారు. 24 గంటల ఉచిత విద్యుత్ అందించామన్నారు. మిషన్ కాకతీయలో భాగంగా వేల చెరువులను పునరుద్ధరించామని పేర్కొన్నారు. కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి, సీతారామ వంటి భారీ ప్రాజెక్టులను నిర్మించామని చెప్పారు.

# ఫ్లైయాష్ తరలింపులో అక్రమాలు

## దేవుడి ముందు పొన్నం ప్రమాణం చేయాల్సిందే

## ఇంట్లోనే ప్రమాణం చేసి సవాల్ చేసిన పాడి కౌశిక్ రెడ్డి



కరీంనగర్, జూన్25(ప్రజా మంటలు): మంత్రి పొన్నం ప్రభాకర్ అవినీతికి పాల్పడ్డాడంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సవాలు విసిరారు. ముందుగా తాను ఎలాంటి అవినీతి చేయలేదని పేర్కొంటూ తడి బట్టలతో దేవుడి ఫొటో ముందు పాడి కౌశిక్ రెడ్డి ప్రమాణం చేశారు. తాను ఎక్కడా ఒక్క అవినీతి చేయలేదని.. చేసే అవసరం కూడా తనకు లేదని స్పష్టం చేశారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సవాలు విసిరారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు అపోలో వెంకటేశ్వర స్వామి దేవాలయానికి వచ్చి తన నిజాయతీని నిరూపించుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కౌశిక్ రెడ్డి సవాలు విసిరారు. ఫ్లైయాష్ తరలింపు, ఓవర్‌లోడ్ లారీల నుంచి డబ్బులు తీసుకోలేదని దేవుడి మీద ప్రమాణం చేయాలన్నారు. ఒకవేళ నువ్వు రాకపోతే అన్ని స్కామ్‌లు చేసినట్లు, అక్రమంగా వేల కోట్ల రూపాయలు దోచుకున్నానని ఒప్పుకున్నట్లేనని స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై పాడి కౌశిక్ రెడ్డి చేసిన ఆరోపణలపై ఇటీవల కాంగ్రెస్ నేత ప్రణవ్‌బాబు స్పందించారు. కౌశిక్ రెడ్డి ఎలాంటి అవినీతి చేయకపోతే చెల్పూరు హనుమాన్ టెంపుల్‌కు వచ్చి ప్రమాణం చేయాలని సవాలు విసిరారు. ఈ సవాలును స్వీకరించిన కౌశిక్ రెడ్డి ఇవాళ చిల్పూరు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు తరలివచ్చారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు కౌశిక్ రెడ్డిని వీణవంకలోనే హౌస్ అరెస్టు చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొంది. ఈ క్రమంలో వీణవంకలోని తన ఇంట్లోనే కౌశిక్ రెడ్డి ప్రమాణం చేసి తన నిజాయతీని రుజువు చేసుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై కౌశిక్‌రెడ్డి చేసిన ఆరోపణలకు ఇటీవల కంగ్రెస్ నేత ప్రణవ్ కౌంటర్ ఇచ్చారు. చెల్పూరు హనుమాన్ టెంపుల్ దగ్గరకు రావాలని సవాలు విసిరారు. ఈ సవాలును పాడి కౌశిక్ రెడ్డి స్వీకరించారు.

# విద్యుత్ విచారణ కమిషన్ రద్దు చేయండి

## జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్‌కు చట్టబద్ధత లేదు

## ఏకపక్షంగా వ్యవహరిస్తోందని హైకోర్టులో కెసిఆర్ పిటిషన్

## రైల్‌రోకో కేసులో విచారణపై స్టే విధించిన కోర్టు



హైదరాబాద్,జూన్25(ప్రజా మంటలు): తెలంగాణలో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, కొత్త థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్‌ను రద్దు చేయాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హైకోర్టును ఆశ్రయించారు. ఆ కమిషన్‌ను రద్దు చేయాలని రిట్ పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ ఏర్పాటు సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా ఉందని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. నిబంధనల మేరకే విద్యుత్ కొనుగోలు జరిగిందని పునరుద్ఘటించారు. జస్టిస్ నరసింహారెడ్డి ప్రెస్‌మీట్లు పెట్టి మరీ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ కేసులో కమిషన్, జస్టిస్ నరసింహారెడ్డి, ఎనర్జీ విభాగాలను ప్రతివాదులుగా ఉన్నారు. తెలంగాణలో గత పదేండ్ల కాలంలో జరిగిన విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు, కొత్త థర్మల్ విద్యుత్తు కేంద్రాల నిర్మాణంపై విచారణ జరిపేందుకు గత మార్చి 14న రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఏకసభ్య విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ యాక్ట్‌- 1952 కింద ఏర్పాటైన ఈ కమిషన్ ఇప్పటికే విచారణను ప్రారంభించి,తెలంగాణ విద్యుత్తు సంస్థలకు చెందిన దాదాపు 25 మంది అధికారులను, మాజీ అధికారులను విచారించింది. దీంతో పాటు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కూడా ఈ నెల 15వ తేదీలోపు వివరణ ఇవ్వాలని కోరుతూ నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కేసీఆర్ 12 పేజీల సుదీర్ఘ లేఖను ఈ నెల 15వ తేదీన కమిషన్‌కు పంపించారు. తెలంగాణలో విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలు, కొత్త థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణంపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన విచారణ కమిషన్ చెల్లదని కేసీఆర్ ఆ లేఖలో స్పష్టంచేశారు. ఎంక్వైరీ కమిషన్ బాధ్యతలు స్వీకరించిన హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నర్సింహారెడ్డికి ఈ అంశాలపై విచారణ జరిపే అర్హత లేదని తేల్చిచెప్పారు. విచారణ కమిషన్ బాధ్యతల నుంచి వెంటనే స్వచ్ఛందంగా వైదొలగాలని జస్టిస్ నర్సింహారెడ్డికి కేసీఆర్ విజ్ఞప్తిచేశారు. మిషన్ టర్మ్స్ అంఢ్ రిఫరెన్స్‌లో ప్రభుత్వం పేర్కొన్న అంశాలకు, జస్టిస్ నర్సింహారెడ్డి విలేకరుల సమావేశంలో చేసిన వ్యాఖ్యలకు కేసీఆర్ ఆ లేఖలో సూటిగా, దీటుగా బదులిచ్చారు. 'న్యాయ ప్రాధికార సంస్థలైన ఈఆర్సీలు వెలువరించిన తీర్పులపై ఎంక్వైరీ కమిషన్ ఏర్పాటు చట్ట విరుద్ధమని, హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించిన మీరు ప్రభుత్వానికి సూచించకుండా, విచారణ కమిషన్ బాధ్యతలు స్వీకరించడం విచారకరం. చట్టవిరుద్ధంగా విచారణ ప్రారంభించడమే కాకుండా, అనేక విషయాలను సమగ్రంగా పరిశీలించకుండానే సమావేశం నిర్వహించి, పలు అంశాలపై అసంబద్ధమైన వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరం. చివరికి న్యాయ ప్రాధికార సంస్థలైన ఈఆర్సీల అధికార పరిధి గురించి చట్టంలో ఏముందో కూడా గమనించకుండా మీరు మాట్లాడారు' అని కేసీఆర్ తీవ్రంగా ఆక్షేపించారు. ఇదిలావుంటే భారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు హైకోర్టులో ఊరట లభించింది. రైలు రోకో కేసులో.. తదుపరి ఉత్తర్వుల వచ్చే వరకూ విచారణపై కోర్టు స్టే విధించింది. విచారణను వచ్చే నెల 23కు వాయిదా వేసి.. ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. 2011లో రైలురోకోకు కేసీఆర్ పిలుపునివ్వడంతో కేసు నమోదైంది. ప్రజాప్రతినిధుల కోర్టులో తనపై ఉన్న కేసు కొట్టివేయాలని కేసీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రోకో కార్యక్రమంలో తాను ఎక్కడా లేనని పిటిషన్ వేశారు.

# ఎమ్మెల్యేలను చేర్చుకోవడం నీతిమాలిన చర్య

## రేవంత్ తీరుపై మండిపడ్డ కెటిఆర్

## పార్టీ మారిన వారిపై అనర్హత వేటు వేయాలి

## స్పీకర్‌ను టైమ్ కోరినట్లు జగదీశ్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్,జూన్25 (ప్రజా మంటలు): పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటున్న రేవంత్ తీరును ఎక్స్ వేదికగా కేటీఆర్ ఎండగట్టారు.ప్రచారంలో నీతులు మాట్లాడిన రేవంత్ రెడ్డి.. ప్రభుత్వంలోకి వచ్చాన నీతిమాలిన పనులు చేస్తున్నారని విమర్శించారు. ఒక పార్టీ తరపున గెలిచి మరో పార్టీలో చేరడం నేరం. ఎమ్మెల్యేలు పార్టీ మారితే రాళ్లతో కొట్టిచంపమన్నారు. రాజీనామా చేయకుండా ఇతర పార్టీల్లో చేరితే ఊళ్లనుంచే తరిమికొట్టమన్నారు. కానీ ఇవాళ రేవంత్ రెడ్డినే.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇండ్లకు వెళ్లి మరీ కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. ఏ ఎమ్మెల్యేనైనా రాజీనామా చేయకుండా పార్టీ ఫిరాయిస్తే.. రాళ్లతో కొట్టించే బాధ్యత తీసుకుంటా అన్నది మీరే. అందుకే జవాబు చెప్పాల్సింది కూడా మీరే అని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ ప్రశ్నించారు. ఇదిలావుంటే బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిన ఎమ్మెల్యేలపై సూర్యాపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మండిపడ్డారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల సభ్యత్వాలు రద్దు కావాల్సి ఉందన్నారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. చట్టం ప్రకారం డాక్టర్ సంజయ్, పోచారం శ్రీనివాస్ రెడ్డి సభ్యత్వాలు రద్దు కావాలి. ఆ ఇద్దరు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్ ఇచ్చేందుకు స్పీకర్‌ను సమయం కోరాం. వెసులుబాటు చూసుకొని సమయం ఇస్తానని స్పీకర్ చెప్పారు. స్పీకర్ న్యాయంగా సమయం ఇస్తారని ఆశిస్తున్నాం. అనర్హత పిటిషన్లపై ఈ నెల 27న హైకోర్టులో విచారణ ఉంది. కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలను వంచిస్తోంది. రాహుల్ కాంగ్రెస్‌ది ఒక విధానం.. రేవంత్ కాంగ్రెస్‌ది మరో విధానం. గత పదేండ్లలో ఫిరాయింపులను ప్రోత్సహించింది బీజేపీ. బీజేపీకి తోకగా తెలంగాణ పీసీసీ వ్యవహరిస్తోంది అని జగదీశ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బాన్సువాడ, జగిత్యాల ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, సంజయ్.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్‌పై గెలుపొందారు. వీరిద్దరిని రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. ఈ నేపథ్యంలో ఆ ఇద్దరిపై గులాబీ శ్రేణులు మండిపడుతున్నారు. ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# బాలికను గంజాయి మత్తులో దింపి అత్యాచారం

## నేరేడ్‌మెట్‌లో వెలుగు చూసిన దారుణ ఘటన

## బాలిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు



హైదరాబాద్, జూన్25(ప్రజా మంటలు):నిర్భయ లాంటి చట్టాలు ఎన్ని తెచ్చినా మృగాళ్ల తీరు మారడం లేదు. తాజాగా, హైదరాబాద్‌లో దారుణం జరిగింది. మత్తుకు బానిసైన యువకులు ఆ మత్తులోనే దారుణాలకు ఒడిగడుతున్నారు. ఓ బాలికకు గంజాయి అలవాటు చేసిన యువకులు ఆమె మత్తులోకి దిగగానే దారుణానికి ఒడిగట్టారు. ఈ అమానుష ఘటన హైదరాబాద్ నేరేడుమెట్‌లో జరిగింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలికపై ఐదుగురు యువకులు అత్యాచారానికి ఒడిగట్టిన దారుణ ఘటన నేరేడుమెట్ పరిధిలో తాజాగా వెలుగుచూసింది. కాచిగూడలో ఉంటున్న ఓ బాలికను ఐదుగురు యువకులు ట్రాప్ చేసి నేరేడుమెట్ తీసుకెళ్లారు. అక్కడ బాలికకు గంజాయి అలవాటు చేసి ఆమె మత్తులోకి వెళ్లగానే ఐదుగురు యువకులు సామూహిక అత్యాచారం చేశారు. బాలిక ఈ ఘోరాన్ని తల్లికి చెప్పకుండా దాచింది. ఆమెలో వస్తున్న మార్పులు గమనించిన తల్లి గట్టిగా నిలదీయగా.. జరిగిన దారుణాన్ని తల్లికి చెప్పింది. దీంతో బాధితురాలి తల్లి పోలీసులను ఆశ్రయించింది. బాధిత బాలిక ఫిర్యాదు మేరకు కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు.. కేసును నేరేడ్‌మెట్‌కు బదిలీ చేశారు. దీనిపై విచారించిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# హామీల అమలులో బిజెపి వెనకడుగు

## ప్రజల దరికి చేరని పలు పథకాలు

## వైఫల్యాలను సమీక్షించుకుంటేనే మేలు

**న్యూఢిల్లీ, జనవరి 25 (ప్రజా మంటలు):** ప్రజలు సంపూర్ణ సాధికరాత సాధించేలా దేశంలో పథకాలు అమలు కావడం లేదు. నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరుగుతోంది. ఆరోగ్యం అందని ద్రాక్షగా మారింది. విద్య విలాస వస్తువుగా మారింది. ఇలాంటి అసమనాతలను రూపుమాపేందుకు పాలకులు చిత్తశుద్దితో కృషి చేయాలి. ఆనాటి పాలకుల దూరదృష్టి లోపం కారణంగా మనకు వారసత్వంగా వచ్చిన సకల అవలక్షణాలు ప్రజలను ఇంకా దరిద్రంలోనే ముంచెత్తుతున్న వేళ పాలకులు గతాన్ని నెమరేసుకుని ముందుకు సాగాల్సిన వేళ ఇది. దేశంలో ఇప్పటికీ సరైన ప్రజారోగ్య వ్యవస్థ లేదు. వ్యవసాయ రంగం కుంగి కృషించిపోతోంది. రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఆహార ధాన్యాలకు మద్దతు ధరలు అందడం లేదు. విద్య మిధ్యగా మారింది. ఉద్యోగాల కల్పన అంతంత మాత్రంగానే ఉంది. ఈ అసమానతల తొలగింపునకు రాజకీయ సంకల్పం బలంగా ఉండాలి. ధనరాజకీయాలను మార్చాల్సిన అవసరం ఉంది. రాజకీయాల్లో నిజాయితీపరులు రావాలి. దేశమంటే అంకితభావం ఉన్న వారి చేతుల్లో పాలన ఉండాలి. అప్పుడే మనం మారుతాం. డబ్బుతో ఓట్లు కొనుగోలు చేసే సంస్కృతికి చరమగీతం పాడకపోతే పెనుముప్పు రాగలదని ప్రజలు కూడా గుర్తించాలి. అప్పటి వరకు గణతంత్రాలు ఎన్నయినా మార్పు రాదు. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత ఈ పదేదేళ్లలో ఇచ్చిన హామీలను అమలు చేసే సంకల్పం లోపించింది. ప్రధానంగా ధరల పెరగుదల విషయంలో పట్టింపు లేకుండా పోయాయి. ఆహారధాన్యాలు ఉత్పత్తి అవుతున్నా వాటికి ధరలు దక్కడం లేదు. గోదాముల్లో ధాన్యం మగ్గుతున్నా బయటకు రావడం లేదు. అలాగే దిగుమతులు కూడా తగ్గడం లేదు. కాంగ్రెస్ తరహా రాజకీయాలు చేస్తున్నారే తప్ప ఆదర్శ రాజకీయాలకు పెట్టింది పేరయిన బిజెపి ఇప్పుడా ముసుగు నుంచి బయటపడింది. ఇటీవలి పరిణామాలు కుటిల రాజకీయాలకు పరాకాష్టగా చెప్పుకోవాలి. బిజెపి లాంటి పార్టీ ఇలాంటి రాజకీయాలు చేయడం వల్ల సహజంగానే దానికున్ని ఇమేజ్ కాస్తా కరిగిపోయేలా చేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్ఠ మసకబారినా, ప్రధానంగా బిజెపికి రాజకీయాలకు చెరగని మచ్చని తెచ్చి పెట్టాయి. అవినీతి రహితంగా సాగుతుందన్న ప్రచారం ఊదర గొడుతున్నారు. మూడోసారి పగ్గాలు చేపట్టిన మోడీ క్షేత్రస్థాయిలో ప్రజల ఇక్కట్లను గుర్తించి పాలన సాగించాల్సి ఉంది. అవినీతి లేకున్నా అక్రమ రాజకీయాలు సాగుతూనే ఉన్నాయి. అయితే కాంగ్రెస్ తరహా రాజకీయాలకు పెద్ద ఎత్తున తెరతీసారు. తన వ్యక్తిగత ప్రతిష్టను పెంచుకునేలా చేసుకుంటున్నారు. పాలనలో మాత్రం అంతగా దూసుకుని పోవడం లేదు. జిఎస్టీ భారాలతో ప్రజలకున్న ఆశలు అడియాశలయ్యాయి. అమిత్‌షా, మోడీ ద్వయం తమ కనుసన్నల్లో పార్టీ వ్యవహారాలను నడుపుతున్నారు. కాంగ్రెస్ విముక్త భారత్ లక్ష్యంగా చేస్తున్న రాజకీయాలు ఒక్కోసారి వెగటుగా ఉంటాయనడానికి ఇటీవలి పరిణామాలు,ఫలితాలు ఉదాహరణగా చెప్పుకోవాలి. కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసే క్రమంలో చేస్తున్న పనులన్నీ దేశహితం కోసమేనని సరిపెట్టుకోలేం. గవర్నర్ వ్యవస్థ అభాసుపాలవుతోంది. మిగతా నాయకులకు, మిగతా పార్టీలకు, భారతీయ జనతా పార్టీకి చెందిన మోదీ,షాలకు కూడా తేడా లేదని



ప్రజలు గుర్తించారు. ఈ క్రమంలోనే తప్పటడుగులు వేస్తున్నారని గుర్తించి ప్రజలు ఒకింత హెచ్చరిక చేశారు. దేశమంతటా అన్ని రాష్ట్రాలలో భారతీయ జనతాపార్టీ పతాకం రెపరెపలాడాలన్నది ఈ ఇరువురి నాయకుల కోరిక! కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు నీతి వాక్యాలు వల్లె వేస్తోంది గానీ దేశ రాజకీయాలు ఇవ్వాళ ఇంతలా భ్రష్టు పట్టిపోవడానికి ఆ పార్టీనే ప్రధాన కారణం. గతంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం కూడా అనేక అడ్డదారులు తొక్కింది. రాష్ట్రాలలో అధికారం నిలబెట్టుకోవడం కోసం లేదా అధికారంలో ఉన్న ఇతర పార్టీల ప్రభుత్వాలను కూల్చడం కోసం కాంగ్రెస్ పార్టీ చేయని అరాచకం లేదు. ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ ఆ తరహా రాజకీయాలనే నడుపుతున్నారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడంలో గానీ, ప్రభుత్వ ఏజెన్సీలను దుర్వినియోగం చేయడంలో గానీ కాంగ్రెస్ ఎప్పుడూ ముందుండేది. ఇప్పుడు అదే పంథాను బిజెపి అనుసరిస్తోంది. మొత్తంగా బిజెపి కాంగ్రెస్‌కన్నా భిన్నం కాదని తేలిపోయింది. ఈ క్రమంలో మోడీ తన పాలనా విధానాలను మార్చుకుని ముందుకు సాగాల్సి ఉంది.

# ఆదాయపన్నును మంత్రులే చెల్లించాలి

## మధ్యప్రదేశ్ కేబినేట్ కీలక నిర్ణయం

**భోపాల్,జూన్25 (ప్రజా మంటలు):** మధ్యప్రదేశ్‌లోని భాజపా సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని మంత్రులు ఇకపై సొంతంగా ఆదాయపు పన్ను చెల్లించాల్సిందేనని సీఎం మోహన్ యాదవ్ నేతృత్వంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వమే ఆ భారాన్ని భరిస్తూ వస్తోంది. 1972 నుంచి ఈ నిబంధన అమల్లో ఉంది. మంత్రులకు చెల్లించే జీతం, ఇతర భత్యాలపై రాష్ట్ర ప్రభుత్వమే వారి తరఫున ఆదాయపు పన్ను చెల్లిస్తోంది. ఈ నేపథ్యంలో దాదాపు 52 ఏళ్ల తర్వాత ఈ నిబంధనకు కేబినెట్ చరమగీతం పాడింది. కేబినెట్ సమావేశంలో మంత్రి కైలాష్ విజయ వర్గీయ ఈ అంశాన్ని లేవనెత్తగా.. మంత్రులు సొంతంగానే ఆదాయపు పన్ను చెల్లించాలని సీఎం మోహన్ యాదవ్ సూచించారు. ఇందుకు కేబినెట్‌లో ఏకాభిప్రాయం వ్యక్తమైంది. మధ్యప్రదేశ్ సర్కారు తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. మంత్రులు, అధికారులు సొంతంగానే విద్యుత్ బిల్లులు చెల్లించాలని అస్సాంలోని హిమంత బిశ్వశర్మ సర్కారు నిర్ణయం తీసుకున్న కొద్ది రోజులకే మధ్యప్రదేశ్ సర్కారు నుంచి ఈ నిర్ణయం వెలువడడం గమనార్హం.

# అయోధ్య గర్భగుడిలో లీకేజీ నిజమే

## పై అంతస్తు పూర్తయితే సమస్య ఉండదన్న ఛైర్మన్

**అయోధ్య, జూన్25 (ప్రజా మంటలు):** అయోధ్య రామమందిరం గర్భగుడిలోకి పైకప్పు నుంచి నీరు కారుతున్నట్టు.. ఆలయ ప్రధాన పూజారి ఆచార్య సత్యేంద్ర దాస్ వెల్లడించిన క్రమంలో దీనిపై ఆలయ నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్ర స్పందించారు. లీకేజీ నిజమేనని అంగీకరించిన ఆయన..దీనికి డిజైన్ సమస్యలు కారణం కాదని వెల్లడించారు. ప్రస్తుతం నేను అయోధ్యలోనే ఉన్నాను. మొదటి అంతస్తు నుంచి వర్షం నీరు కారడాన్ని చూశాను. గురుమండపం నుంచి ఆకాశం కనిపిస్తుంది. శిఖర నిర్మాణం పూర్తయితే అది కవర్ అవుతుంది. ప్రస్తుతం మొదటి అంతస్తు నిర్మాణ పనుల్లో పురోగతి ఉంది. ఒకసారి ఆ పనులు పూర్తయితే అక్కడి పైపులు అన్ని మూసివేస్తాం. అలాగే గర్భగుడిలో ఎలాంటి డ్రైనేజీ తరహా నిర్మాణం లేదు‘ అని వెల్లడించారు. మొత్తం ఆలయ నిర్మాణ పనులు డిసెంబర్ నాటికి పూర్తవుతాయని తెలిపారు. శనివారం రాత్రి భారీ వర్షం పడటంతో లీకేజీ సమస్య బయటపడిందని, నీరు సరిగ్గా రామ్‌లల్లా విగ్రహానికి ఎదురుగా పూజారి కూర్చునే, వీఐపీలు దర్శనం చేసుకునే చోట కారుతోందని సత్యేంద్రదాస్ పేర్కొన్నారు.ఆలయ నిర్మాణంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని, ఆలయ ప్రాంగణం నుంచి వర్షపు నీరు పోయేందుకూ సరైన ఏర్పాట్లు లేవని.. ఈ సమస్యపై ఆలయ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ ఏడాది జనవరి 22న రామ మందిరంలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను వైభవంగా నిర్వహించిన సంగతి తెలిసిందే.

# రేవంత్‌రెడ్డివి గోబెల్స్ ప్రచారాలు

## మండిపడ్డ బిఆర్ఎస్ నేత వినోద్

**హైదరాబాద్,జూన్25(ప్రజా మంటలు):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డివి అన్నీ గోబెల్స్ ప్రచారాలు అని బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. తప్పుడు ప్రచారాలు చేస్తూ ఊరుకోం అని రేవంత్‌ను వినోద్ కుమార్ హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో వినోద్ కుమార్ మీడియాతో మాట్లాడారు. సైనిక్ స్కూల్ కోసం కేసీఆర్ ఎంతో ప్రయత్నించారు. కేసీఆర్ రాసిన లేఖలన్నీ ఇప్పటికీ ఉన్నాయి. సైనిక్ స్కూల్ ఖర్చులు రాష్ట్ర ప్రభుత్వం భరించాలని కేంద్రం షరతులు పెట్టింది. రేవంత్ రెడ్డి మాపై నిందలు వేయడం దుర్మార్గం. నిరుద్యోగులను రెచ్చగొట్టి ఓట్లు దండుకున్నారు.

# కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు పాటించలేదు

## రాహుల్ డిప్యూటి ప్రతిపాదనలపై చర్చ

**న్యూఢిల్లీ, జనవరి 25 (ప్రజా మంటలు):** లోక్‌సభ స్పీకర్‌గా వరుసగా రెండోసారి ఓం బిర్లా ఏకగ్రీవంగా ఎన్నికవుతారని అంతా భావించారు. కానీ ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ తమ స్పీకర్ అభ్యర్థిగా కె.సురేశ్‌ను బరిలో దింపింది. దీంతో లోక్‌సభ స్పీకర్ ఎన్నిక అనివార్యమైంది. ఈ నేపథ్యంలో ఆ పదవికి రేపు ఎన్నిక జరగనుంది. అయితే లోక్‌సభ స్పీకర్ పదవి మీరు తీసుకోండి.. డిప్యూటీ స్పీకర్ పదవి మాత్రం ప్రతిపక్షానికి కేటాయించి పాత సంప్రదాయాన్ని కొనసాగించడంటూ బీజేపీ పెద్దల ముందు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రతిపాదన చేశారు. రాహుల్ చెబుతున్న ఈ పాత సంప్రదాయంపై రాజకీయ వర్గాల్లో ఓ ఆసక్తికర చర్చ అయితే వాడి వేడిగా నడుస్తుంది. దీనిపై కొందరు అధికార పార్టీ ఎంపిలు తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ పాలిత లేదా ఇండియా కూటమి పాలిత రాష్ట్రాల్లో ఈ సంప్రదాయం ఎందుకు కొనసాగించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఎందుకంటే బీజేపీ పెద్దల ముందు రాహుల్ గాంధీ పెట్టిన ఈ 'సంప్రదాయం' ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్ష పార్టీలు పాలిస్తున్న రాష్ట్రంలో కానరావడం లేదనే ఓ చర్చ వైరలవుతుంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కర్ణాటక, కేరళ అసెంబ్లీలలో అధికార పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలే స్పీకర్లు, డిప్యూటీ స్పీకర్లుగా కొనసాగుతున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ పాలిత రాష్ట్రాలు తెలంగాణ, ఝార్ఖండ్‌లలో స్పీకర్‌గా ఆ పార్టీ వారే ఎన్నికయ్యారు. మరోవైపు ఈ రెండు రాష్ట్రాల అసెంబ్లీలో డిప్యూటీ స్పీకర్లు లేక పోవడం గమనార్హం. అలాగే పంజాబ్, ఢిల్లీలలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం కొలువు తీరింది. ఆయా రాష్ట్రాల అసెంబ్లీలలో స్పీకర్, డిప్యూటీ స్పీకర్లు ఇద్దరు అధికార పార్టీకి చెందిన వారేనన్న విషయం అందరికీ తెలిసిందే. హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీలో సైతం స్పీకర్, డిప్యూటీ స్పీకర్లు ఇద్దరు హస్తం పార్టీకి చెందిన వారే కొనసాగుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చెబుతున్న పాత సంప్రదాయం 'ఇండియా కూటమి' ఎలుబడిలో ఉన్న రాష్ట్రాల్లో ఎక్కడా లేదనే ఓ చర్చ సైతం హాట్ హాట్‌గా కొనసాగుతుంది.

# నేడు స్కూళ్ల బంద్‌కు ఎబివిపి పిలుపు

**హైదరాబాద్,జూన్25 (ప్రజా మంటలు)::** ప్రైవేటు బడుల్లో ఫీజులను నియంత్రించాలని, సర్కారు బడుల్లో వసతులు కల్పించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా బుధవారం స్కూళ్ల బంద్‌కు ఎబివిపి విద్యార్థి సంఘం పిలుపునిచ్చింది. ఈ మేరకు ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ ఒక ప్రకటనలో తెలిపారు. సర్కారు బడుల్లోని సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాల దృష్టికి అనేక సార్లు తీసుకుపోయినా ఫలితం లేకుండా పోయిందన్నారు. కార్పొరేట్ స్కూళ్లలో రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నా, ఆయా మేనేజ్?మెంట్లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఫీజుల నియంత్రణకు చట్టం తీసుకొస్తామని అనేక హామీలు ఇచ్చినా, ఇప్పటికీ అమలు చేయడం లేదని పేర్కొన్నారు. ఈ నెల 26న జరిగే స్కూళ్ల బంద్?కు మేనేజ్ మెంట్లు సహకరించాలని కోరారు.

# ఆందోళన కలిగిస్తోన్న అమెరికాలో ఉద్యోగాల కోత

## నెరవేరని మేకిన్ ఇండియా సంకల్పం

## దేశీయ ఉత్పత్తులకు దక్కని ప్రోత్సాహం

## చిన్నతరహా పరిశ్రమలను ఆదుకుంటేనే మేలు



**న్యూఢిల్లీ, జనవరి 25 (ప్రజా మంటలు):** అమెరికాలో ఉద్యోగాల కోత ఆందోళన కలిగిస్తున్న వేళ ..నిరుద్యోగులకు భరోసా కల్పించేలా భారత ప్రభుత్వం పథకాలు అమలుచేయాలి. పట్టాలు చేతబట్టుకుని వెళ్లిన వారు మళ్లీ బ్యాగు సర్దుకుని వచ్చే దుస్థితి వచ్చింది. చెప్పాపెట్టకుండా అనేక కంపెనీల్లో ఉద్యోగులను తొలగించేస్తున్నారు. దీంతో ఆశతో అమెరికా లాంటి దేశాకు వెళ్లిన వారు బిక్కమొహం వేసుకుని తిరిగి రావాల్సి వస్తోంది. అలాంటి వారు స్వదేశానికి వస్తే వారికి అండగా నిర్ణయాలు తీసుకోవాలి. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా వెనక్కి వచ్చిన వైద్య విద్యార్థులవిషయంలో అన్యాయం జరిగింది. ఇప్పుడు వీరికీ అలాంటి అన్యాయం జరగరాదు. దేశం అండగా నిలిచిందన్న సంకేతాలు ఇవ్వాలి. ఉద్యోగాల కల్పనకు ఎంతయినా వెచ్చించాలి. కొత్తగా పని దొరికే రంగాలను ప్రోత్సహించాలి. వారి కష్టాలను మననం చేసుకుని స్వయం ఉపాధి పెంచగలిగితే అంతకు మించిన ఆనందం ఉండదు. యువతకు ఉపాధి కల్పించే రాంగాలకు ఇతోధికంగా అంటే..వడ్డీ రహిత రుణాలు ఇవ్వగలగాలి. ప్రజల కోసం పరితపించేలా పాలన సాగిస్తామని ప్రతిన చేయాల్సిన సమయ మిది. దేశీయంగా ఉత్పత్తులపై దృష్టి పెట్టి స్వయం సమృద్ధి సాధించకుండా విదేశీ పెట్టుబడులకు వెంపర్లాడుతున్న విధానం పోవాలి. దేశీయంగా ఉన్న సాంకేతికతను ఉపయోగించుకుని యువతను స్వయం ఉపాధి వైపు మళ్లేలా సన్నద్ధం చేయాలి. వ్యవసాయం, అనుబంధ రంగాలను అభివృద్ధి చేస్తే ఈ దేశం ఇతర దేశాలకు ఆహారధాన్యాలను ఎగుమతి చేయగలదు. సింగపూర్, మలేషియా తదితర చిన్నదేశాలను ఆదర్శగా తీససుకుని ఆయా రాష్ట్రాలు స్వయం సమృద్ధి సాధించే ప్రణాళికలతో సాగాల్సిన అవసరాన్ని ఈ గణతంత్రం రోజు ప్రతిన తీసుకోవాలి. మేకిన్ ఇండియాను బలంగా ప్రజల్లోకి తీసుకుని వెళ్లి అందుకు అనుగుణంగా కార్యాచరణ చేయాలి. ఇంతకాలం ఎక్కడ లోపం ఉందో గుర్తించి అవలోకనం చేసుకోవాలి. ఆత్మపరిశీలన చేసుకోవాలి. విద్యావైద్య రంగం ఎందుకు వెనకబడి ఉందో తెలుసుకోవాలి. ఆహారధన్యాలను ఇంకా ఎందుకు దిగుమతి చేసుకుంటున్నామో ఆలోచన చేయాలి. అన్నిరంగాల్లో మనం ముందంజ వేయాల్సిన దశలో ఇంకా దిగుబడులపై ఆధారపడుతూ ఎగుమతుల విషయంలో లక్ష్యం లేకుండా సాగుతున్నాం. మనం చేపట్టిన సంస్కరణలు ఫలితాలు ఇవ్వడం లేదన్న విషయాన్ని గుర్తించడం లేదు. జిఎస్టీని సమర్థించిన ఆయా రాష్ట్రాల సిఎంలే ఇప్పుడు దాని బారినుంచి రక్షించాలని కోరుకుంటున్నారు. వివిధ రంగాలపై అదిచూపిస్తున్న చెడు ప్రభావాన్ని విశ్లేషించుకోవాల్సిన కేంద్రం ప్రభుత్వం మొడిగా వ్యవహరిస్తోందే తప్ప ప్రజల కోణంలో ఆలోచించడం లేదు. బ్యాంకుల్లో దాచుకున్న డబ్బును సొంత అవసరాలకు తీసుకోవడానికి కూడా ఇబ్బంది పడటాన్ని గ్రామాల్లో ఇప్పటికీ చూస్తున్నాం. ఆహారధాన్యాల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ముక్కుపిండి వసూలు చేస్తున్న పన్నులను పాలకుల విలాసాలకు ఖర్చు చేసుకుంటున్నారు. ఎన్నికలలో డబ్బు అవసరం లేకుండా సంస్కరణలు తీసుకురాకుండా ఎన్ని చర్యలు తీసుకున్నా లాభం లేదు. రాజకీయ పార్టీల ప్రధాన లక్ష్యం అధికారమే కనుక, ఆ అధికారం కోసం ఎంతకైనా తెగబడతాయని ఈ 75 ఏళ్లలో నిరూపితం అయ్యింది.

# ఎన్‌డిఎకు షాక్ ఇచ్చిన ఇండియా కూటమి

## స్పీకర్ పదవికి పోటీని పెట్టిన కాంగ్రెస్

## ఓంబిర్లాకు పోటీగా కొడికున్నల్ సురేశ్ నామినేషన్

## నేడు స్పీకర్ ఎన్నికకు ఓటింగ్

**న్యూఢిల్లీ, జనవరి 25 (ప్రజా మంటలు):** దేశ చరిత్రలో తొలిసారి స్పీకర్ ఎన్నికకు పోటీ జరుగుతోంది. అధికార ఎన్‌డిఎ ఏకపక్ష నిర్ణయానికి వ్యతిరేకంగా ఇండియా కూటమి సై అంటోంది. లోక్‌సభ స్పీకర్ పదవికి ఎన్డీయే అభ్యర్థిగా ఓం బిర్లా ఏకగ్రీవం అవుతారని భావించిన బీజేపీ, ఎన్డీయే కూటమికి విపక్ష కాంగ్రెస్ భారీ షాక్ ఇచ్చింది. సంఖ్యా బలం తక్కువున్నా.. కాంగ్రెస్ పార్టీ స్పీకర్ పదవికి అభ్యర్థిని నిలిపింది. ఈ మేరకు కేరళ నుంచి 8సార్లు ఎంపీగా గెలుపొందిన కొడికున్నిల్ సురేష్‌ను ఇండియా కూటమి నుంచి స్పీకర్ అభ్యర్థిగా ప్రకటిస్తూ కాంగ్రెస్ నిర్ణయించింది. ఆయన మంగళవారం తన నామినేషన్ దాఖలు చేశారు. డిప్యూటీ స్పీకర్ పదవిని విపక్షానికి అప్పగించాలన్న సంప్రదాయాన్ని బీజేపీ తుంగలో తొక్కుతోందని రాహుల్ ఆరోపించారు. ఇకపోతే సీనియార్టీ ప్రకారం సురేశ్ ప్రోటెం స్పీకర్ కావాల్సి ఉన్నా, అధికార ఎన్‌డిఎ కూటమి ఒడిషాకు చెందిన మరో సీనియర్ భర్తృహరిని ఎంపిక చేసింది. ఈ నిర్ణయంపై ఇండియా కూటమి ఆగ్రహంతో ఉంది. ఈ క్రమంలో కనీసం దప్యూటి స్పీకర్ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ కోరుతోంది. డిప్యూటి పదవిని తమకే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. అయితే సయోధ్య కుదరకపోవడంతో దేశ చరిత్రలో తొలిసారిగా లోక్‌సభ స్పీకర్ పదవికి ఎన్నిక జరగనుంది. ఇప్పటికి వరకు జరిగిన లోక్‌సభ స్పీకర్ పదవులన్నీ ఏకగ్రీవం అయ్యాయి. కాగా 75 ఏళ్ళ దేశ చరిత్రలో లోక్‌సభ స్పీకర్ పదవికి ఎన్నిక జరగడం ఇదే తొలిసారి కానుంది. తొలుత స్పీకర్ ఎన్నికను ఏకగ్రీవం అవుతుందని భావించారు. కానీ స్పీకర్ ఎన్నికకు కాంగ్రెస్ పార్టీ మెలిక పెట్టింది. కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఇండియా కూటమి సభ్యులతో జరిపిన చర్చల్లో.. డిప్యూటీ స్పీకర్ పదవిని విపక్షాలకు ఇస్తే స్పీకర్‌కి మద్దతు తెలుపుతామని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. దీంతో డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చేందుకు ఎన్డీయే కూటమి దాదాపు అంగీకరించినట్లు వార్తలు వచ్చాయి. కానీ, కాంగ్రెస్ అనూహ్యంగా అభ్యర్థిని పోటీలో నిలిపింది. దీంతో స్పీకర్ పదవికి తొలిసారి పోటీ జరుగబోతున్నది. తొలిసారి ప్రతపక్ష అభ్యర్థిగా కొండికునాల్ సురేశ్ పోటీపడుతున్నారు. కాగా ఎన్ డిఎ అభ్యర్థిగా ఓమ్ బిర్లా పోటీపడుతున్నారు. నామినేషన్ల పక్రియ మధ్యాహ్నం 12.00 గంటలకు ముగిసింది. ప్రతిపక్ష ఇండియా బ్లాక్ తో మోడీ నేతృత్వంలోని ఎన్ డిఎ ప్రభుత్వం డిప్యూటీ స్పీకర్ విషయంలో ఓ అంగీకారానికి రాలేకపోయింది. దాంతో స్పీకర్



పదవికి పోటీ నెలకొంది. 18వ లోక్ సభ తొలి రోజు సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీ సహా 262 మంది కొత్తగా ఎన్నికయిన ఎంపీలు ప్రమాణస్వీకారం చేశారు. కాగా మిగతా 281 మంది కొత్త ఎంపీలు మంగళవారం ప్రమాణ స్వీకారం చేసారు. వారిలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ, సమాజ్ వాదీ పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ ఉన్నారు.స్పీకర్ ఎన్నిక బుధవారం జరుగనున్నది. ఇదిలావుండగా ఇండియా బ్లాక్ కు చెందిన ఎంపీలు పార్లమెంటు లోపల, వెలుపల 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అన్న నినాదాలతో, రాజ్యాంగం ప్రతులను పట్టుకుని నిరసన తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జూన్ 27 న ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఆ తర్వాత రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే పక్రియ కొనసాగనున్నది. వచ్చే వారం ఉభయ సభలలో ప్రధాని మోడీ చర్చలపై సమాధానాలు ఇవ్వనున్నారు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com